ప్రజాశక్తి

శనివారం 16 మార్చి 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

విజయవాడ వన్‌టౌన్‌లో నిరసన తెలుపుతున్న జనసేన పార్టీ శ్రేణులు

టిడిపి, జనసేనల్లో

చల్లారని సెగలు

- చంద్రబాబుతో బోడే చర్చలు విఫలం
- పోతినకు పవన్ షాక్
- భగ్గుమన్న జన సైనికులు
- స్వతంత్రంగా పోటీకి బోడే ప్రచారం ప్రారంభం

పెనమలూరు మండలంలో స్వతంత్ర అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్న బోడే ప్రసాద్

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, వన్‌టౌన్

సార్వత్రిక ఎన్నికలకు శనివారం నోటిఫికేషన్ వెలువడనుండగా టిడిపి, జనసేన పార్టీల్లో రాజుకుంటున్న అసంతృప్తి సెగలు ఇంకా చల్లారడంలేదు. ఇది ఆయా పార్టీల కార్యకర్తలను, అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది. శుక్రవారం కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో టిడిపి, జనసేన కార్యకర్తల ఆందోళనలు కొనసాగాయి. మాజీ ఎంఎల్‌ఎ, టిడిపి పెనమలూరు నియోజకవర్గ ఇన్చార్జి బోడే ప్రసాద్ తనకు సీటు కేటాయించాలని శుక్రవారం తాడేపల్లిలో టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశారు. అయితే ఆయన నిరాకరించినట్లు తెలిసింది. దీంతో నియోజకవర్గంతో సంబంధంలేని ఇతరులకు టికెట్ కేటాయిస్తే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని బోడే తెగేసి చెప్పినట్లు సమాచారం. అంతేగాక తిరిగి వచ్చిన తర్వాత నియోజకవర్గంలోని ప్రముఖులను కలుసుకుంటున్నారు. యనమలకుదురు రామలింగేశ్వరాలయం నుంచి అనుచరులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర యనమలకుదురు, పప్పులమిల్లు సెంటర్, తాడిగడప, కార్మికనగర్ మీదుగా పోరంకిలోని టిడిపి కార్యాలయం వరకు సాగింది. ఈ యాత్రలో ఆయన ఓటర్లను కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బోడే ప్రసాద్ భార్య హేమ చౌదరి, కుమారుడు వెంకటరామ్, కుమార్తె వైష్ణవితోపాటు నియోజకవర్గంలోని టిడిపి ప్రముఖులు అనుమోలు ప్రభాకర్, వెలగపూడి శంకరబాబు, పి.గోపిచంద్, రంగారావు, కోయ ఆనంద్, కంకిపాడు, ఉయ్యూరు ప్రాంతాలకు చెందిన పలువురు నాయకులు, మహిళా సంఘం రాష్ట్ర నాయకులు యార్లగడ్డ సుచిత్ర, యువజన నాయకులు దండమూడి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి తుది జాబితాపై ఉత్కంఠ

టిడిపి తుది జాబితాను శనివారం ప్రకటిస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ జాబితా తర్వాత కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో పెనమలూరు, అవనిగడ్డ, మైలవరం, విజయవాడ పశ్చిమ సీట్లలో పోటీ చేసే అభ్యర్థులపై స్పష్టత వస్తుంది. పొత్తులో భాగంగా బిజెపికి విజయవాడ పశ్చిమ సీటును, జనసేనకు మచిలీపట్నం ఎంపి, అగనిగడ్డ అసెంబ్లీ సీట్లను కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోంది.

బిజెపికి పశ్చిమ సీటు కేటాయింపుపై ఆగ్రహం

విజయవాడ పశ్చిమలో పోతినకు బిగ్‌షాక్ తగిలింది. కూటమి పొత్తులో భాగంగా పశ్చిమ సీటును బిజెపికి కేటాయిస్తున్నట్లు జనసేన అధినేత పవన్ కల్యాణ్ తేల్చిచెప్పడంతో ఆ పార్టీ కార్యకర్తలు ఖంగుతున్నారు. పశ్చిమ సీటును జనసేనకే కేటాయించి పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి, పార్టీ నగర అధ్యక్షుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్‌కు టికెట్ ఇస్తారని జనసైనికులు ఆశించారు. ఈ క్రమంలోనే ఇప్పటికే ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసుకున్నారు. పవన్ కళ్యాణ్ తాజా ప్రకటనతో జన సైనికులు షాక్‌కు గురయ్యారు. పోతినకు సీటు లేదని పవన్ కళ్యాణ్ ప్రకటించడంతోపాటు ఆ సీటును పొత్తులో భాగంగా బిజెపి కేటాయిస్తున్నట్లు సమాచారం రావడంతో జనసేన శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. పవన్ తీరుపై జనసేన శ్రేణులు మండిపడ్డాయి. పవన్ తమను నమ్మించి మోసం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్‌ను పోతిన వెంకట మహేష్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆయన అనుచరులు (మిగతా 6లో)

పిఠాపురం ఘటనపై ఎందుకు స్పందించరు ? : పోతిన

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీ చేస్తున్నట్లు ప్రకటించగానే, పొత్తులో ఉన్న టిడిపి నేతలు అక్కడ రచ్చరచ్చ చేశారని జనసేన నేత పోతిన వెంకట మహేష్ విమర్శించారు. తమ పార్టీ అధ్యక్షుడికే నిరసన గళం వినిపించారని పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ వన్‌టౌన్‌లోని తన కార్యాలయంలో పోతిన మీడియాతో మాట్లాడుతూ..."పిఠాపురంలో అంత డ్యామేజ్ జరిగితే ఒక్క టిడిపి నేతైనా స్పందించారా? ఇదేనా పొత్తు ధర్మం, పొత్తు ధర్మం పాటిస్తేనే ఓట్ల బదిలీ జరుగుతుంది, పవన్‌కు అవమానం జరిగితే ఒక్క జనసేన నాయకుడైనా స్పందించారా" అని ప్రశ్నించారు. పీఠాపురంలో టిడిపి శ్రేణులు నిరసన తెలపడం పొత్తు ధర్మం కాదన్నారు. పొత్తులో ఉన్న పార్టీలు దీనిపై స్పందించటం లేదని విమర్శించారు. పొత్తు ధర్మంలో అందరూ కలిసి రావాలన్నారు. అధ్యక్షుడి పరిస్థితే బాగోలేకపోతే రాష్ట్రంలో పొత్తుల పరిస్థితి ఎలా బాగుంటుందని, జనసేనలో దీనిపై ఎవరూ ఎందుకు మాట్లాడడంలేదని ప్రశ్నించారు. అధి నాయకులు నష్ట నివారణకు ఎందుకు (మిగతా 6లో)

ఎన్‌టిటిపిఎస్ ప్రధాన గేటు వద్ద నిరసన తెలుపుతున్న ఆందోళనకారులు

కాలుష్యంపై ఉద్యమం ఉధృతం

- ఎన్‌టిటిపిఎస్ మెయిన్ గేటు వద్ద బైఠాయించి నిరసన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మూడు దశాబ్దాలలో మొట్టమొదటి సారిగా బూడిద కాలుష్య వ్యతిరేక ఉద్యమం ఉగ్రరూపం దాల్చింది. కాలుష్యాన్ని నియంత్రించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఇబ్రహీంపట్నంలో కాలుష్య ప్రభావిత ప్రాంత ప్రజలు, విద్యార్థులు పెద్దఎత్తున ర్యాలీ చేపట్టారు. డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ గేటు వద్దవైపు ఆందోళకారులు దూసుకెళ్లడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. డౌన్‌డౌన్ ఎన్‌టిటిపిఎస్ అంటూ చేసిన నినాదాలతో ప్రాంగణం దద్దరిల్లింది. దీంతో అధికారులు నివ్వెరపోయారు. పోరాట సమితి ఆధ్వర్యాన గత 50 రోజులుగా శాంతియుతంగా ఆందోళన కొనసాగుతోంది. అయితే కొత్తగా వచ్చిన ఎన్‌టిటిపిఎస్ చీఫ్ ఇంజనీర్, ఎపి జెన్కో డిఎస్‌పి గురవారం ఆందోళనకారులను పిలిపించి సోషల్ మీడియాలో ఎన్‌టిటిపిఎస్‌పై పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామంటూ బెదిరించారు. కాలుష్య నియంత్రణ ప్రజా పోరాట సమితి సభ్యుడిని నిర్బంధించారు. దీంతో శుక్రవారం ప్రజలు నిరసనకు మెయిన్ గేట్ బయట బైఠాయించారు. యాజమాన్యం దిగొచ్చేవరకు పోరాటం ఆగదని నినాదాలు చేశారు. ఆందోళనకారులను బెదిరించిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకొని కాలుష్య నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలని (మిగతా 6లో)

17న గ్రూప్ 1 స్క్రీనింగ్ పరీక్ష

24 పరీక్షా కేంద్రాలు

10,525 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఈనెల 17న జరిగే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -1 స్క్రీనింగ్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. పరీక్షాల ఏర్పాట్లపై శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ విసి హాల్లో ఆయన...లైజనింగ్ ఆఫీసర్లు, సూపర్ వైజర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని 24 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4 గంటల వరకు అబ్జెక్టివ్ విధానంలో పరీక్ష జరుగుతుందన్నారు. ఈపరీక్షకు 10,525 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. 24 మంది లైజనింగ్ అధికారులను, 24 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఫొటోతో ఉన్న ఏదైనా ఒరిజనల్ ఆధార్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ కార్డ్, పాస్‌పోర్ట్, రేషన్ కార్డ్, ఐడి గుర్తింపు కార్డులను తప్పకుండా తీసుకురావాలన్నారు. ఉదయం 9.45 తరువాత, మధ్యాహ్నం 1.45 తరువాత అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, ఆర్డీవో బీహెచ్.భవానీ శంకర్ పాల్గొన్నారు.

ప్రైవేటు టీచర్లకు బొండా ఉమా ఎర

- ఓట్ల కోసం చీరలు పంపిణీ

సమావేశంలో ఒకపక్క బొండా మాట్లాడుతుండగానే మరోపక్క చీరలు పంపిణీ చేస్తున్నఅనుచరులు

ప్రజాశక్తి - విజయవాడ : ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో అధికార వైసిపి, టిడిపిలు పోటీ పడుతున్నాయి. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఆపార్టీలు ఓటర్లను వివిధ రూపాల్లో ప్రలోభాలకు గురి చేస్తున్నాయి. ఈ నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థిగా వెలంపల్లి శ్రీనివాసరావు, టిడిపి అభ్యర్థిగా మాజీ ఎంఎల్‌ఎ బొండా ఉమామహేశ్వరరావు పోటీచేస్తున్నారు. కానీ వారు ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టకుండా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే పనిలో బిజీబిజీగా ఉన్నారు. టిడిపి అభ్యర్థి బొండా శుక్రవారం సమావేశం పేరుతో ప్రైవేటు టీచర్లను తన నియోజకవర్గ కార్యాలయానికి రప్పించుకొని మహిళా టీచర్లకు చీరలను, పురుషులకు గిఫ్ట్‌లను పంపిణీ చేశారు. ఒకపక్క బొండా ఉమా మాట్లాడుతుండగానే, మరోపక్క ఈ సమావేశానికి హాజరైన ప్రైవేటు టీచర్లందరికీ ఆయన అనుచరులు చీరలు, పురుషులకు బహుమతులు పంపిణీ చేశారు. వైసిపి అరాచకాలను ఇళ్ల వద్ద పిల్లల తల్లిదండ్రులకు చెప్పి, సైకిల్ గుర్తుకే ఓటు వేసేలా చూడాలని వారికి బోండా హితబోధ చేశారు. ఒక్కొక్కరు పది మందికి చెప్పాలని కోరారు. చీరల పంపిణీ వ్యవహారంపై నగరంలో పెద్ద దుమారం రేగింది. ఇటీవల వార్డు వాలంటీర్లకు వైసిపి ఇన్చార్జి వెలంపల్లి శ్రీనివాస్ కుక్కర్లు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఓటర్లను ప్రలోభపెట్టడం ఇప్పుడే ఈ రకంగా ఉంటే పోలింగ్ సమయం దగ్గర పడే కొద్దీ ఇంకొన్ని ప్రలోభాలకు గురిచేస్తారోనని ఓటర్లు చర్చించుకుంటున్నారు.

రంజాన్ దీక్షల వేళలు

ఇఫ్తార్ : శనివారం సాయంత్రం 6.32
సహర్ : ఆదివారం ఉదయం 5.01

గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి - వత్సవాయి : సిఐఎస్ఎఫ్, వత్సవాయి పోలీసు సిబ్బంది పోలంపల్లి, పెండ్యాల వారి గూడెం డబ్బుకుపల్లి గ్రామాల్లో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. శాంతి భద్రతలు అనునిత్యం తప్పనిసరిగా ఉంటాయని రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణం ఉండేలా భద్రత కల్పిస్తామని భరోసా కల్పిస్తూ ఈ మార్చి ఫాస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి ఎస్ఐ అభిమన్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దేవస్థానంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో రూ.67 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆలయ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక దేవాలయాలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. తిరుమలగిరి దేవస్థానంలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనం పెంచడం సంతోషదాయమన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా తెలిపారు.

17న ఉమ్మడి సభకు తరలిరావాలి : టిడిపి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఈ నెల 17న పల్నాడు జిల్లా, చిలకలూరిపేట నియోజకవర్గం, బొప్పూడిలో టిడిపి, బిజెపి, జనసేన ఆధ్వర్యంలో జరుగుతున్న ఉమ్మడి సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు అందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని టిడిపి జిల్లా అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురాం పిలుపునిచ్చారు. పట్టణంలో కొత్త వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మండపంలో శుక్రవారం టిడిపి, జనసేన, బిజెపిల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు పార్టీల కలయిక రాష్ట్ర భవిష్యత్తు కోసం అన్నారు. ముఖ్య అతిథులుగా జగ్గయ్యపేట టిడిపి అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్, బిజెపి జిల్లా కోర్ కమిటీ మెంబర్ కేసర రాంబాబు, బిజెపి జగ్గయ్యపేట నియోజకవర్గ కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు, జనసేన కృష్ణాజిల్లా సంయుక్త కార్యదర్శి ఈమని కిషోర్, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బాడిశ మురళీకృష్ణ పాల్గొన్నారు.

నెమలి ఆలయ చైర్మన్‌గా కావూరి

ప్రజాశక్తి - గంపలగూడెం : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన నెమలి వేణుగోపాల స్వామివారి ఆలయ కమిటీ చైర్మన్‌గా, కావూరి శశిరేఖను నియమిస్తూ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆలయ సహాయ కమిషనర్ ఎన్.వి. సాంబశివరావు కార్యవర్గ ప్రమాణ స్వీకారం పూర్తి చేశారు. ఇప్పటికే కావూరి శశిరేఖ చైర్మన్‌గా, తన కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో సమయం ముగిసినందున దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిటీని రద్దు చేస్తూ ప్రకటన చేసింది. ఈ నెల 23 నుండి 28వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీ అత్యంత ఆవశ్యమైంది. ఈ పరిస్థితుల్లో సదరు శాఖ నుండి 10 మంది సభ్యులతో పాటు చైర్మన్ నియామక ఉత్తర్వులను విడుదల చేసింది. అందులో భాగంగా, ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులచే శుక్రవారం సాయంత్రం పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా, కావూరి శశిరేఖ, సభ్యులుగా, కొండపల్లి కొండలరావు, మోదుగు సుహాసిని, బండి చిన్నమ్మ, మనుబోలు వెంకటేశ్వరరావు, తొట్టారు పూర్ణచంద్రరావు గరిడేపల్లి వెంకటరమణ, కటారు చిన్నకృష్ణ, మైలవరపు రామకష్ణ, ఉప ప్రధాన అర్చకులు తిరునగరి రాజగోపాల్ ఆచార్యుల పేర్లను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న సామినేని, తదితరులు

విస్సన్నపేట మండలంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న అధికారులు

పలువురికి ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని బూదవాడ గ్రామంలో 16 ఎకరాల ప్రభుత్వ భూమిలో 600 మంది లబ్ధిదారులకు గురువారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో పండుగలా ఇళ్లపట్టాలను అందజేస్తున్నామని తెలిపారు. 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలను అందజేసిన ఘనత మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందని అన్నారు. బూదవాడ గ్రామంలో 1800 కుటుంబాలు ఉండగా నాలుగున్నరేళ్ల జగనన్న సంక్షేమ పాలనలో 36 కోట్ల రూపాయలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందించినట్లు తెలిపారు. ఇళ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారులకు తమ ఇంటి నిర్మాణం పూర్తి చేసే వరకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని తిరుమలగిరి గ్రామంలో నవరత్నాల్లో పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీలో 54 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను సామినేని ఉదయభాను చేతుల మీదుగా పంపిణీ చేశారు.

విస్సన్నపేట : మండలంలోని నరసాపురం గ్రామంలో సచివాలయం 1 పరిధిలో జగనన్న ఇంటి పట్టాలను అధికారులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పులపాక మారేసు, వైసిపి నాయకులు తాణంకి రాంబాబు, కాసర చెన్నారెడ్డి, పంచాయతీ సెక్రెటరీ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. **(ప్ర.వి)**

పంట నమోదు పత్రాలు సిద్ధం

ప్రజాశక్తి - తిరువూరు : రబీ సీజన్లో పంటలు సాగు చేసే రైతులు వివరాలను మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని తిరువూరు మండల వ్యవసాయ అధికారిణి పి.పద్మ తెలిపారు. ఈ క్రాప్‌లో పంటలు నమోదు చేయించుకుని, వేలిముద్రలు వేసిన రైతులు తమ సమీప రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు భౌతిక ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాలని సూచించారు. పండించిన ధాన్యం అమ్ముకోవాలన్న, పంట నష్టప రిహారం పొందాలన్న రైతుల వద్ద ఈ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.

మండలంలో 4 టెన్త్ పరీక్షా కేంద్రాలు

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలంలోని జరుగబోవు పదో తరగతి పరీక్షలకు ఆరు పరీక్ష కేంద్రాలు ఎంపిక చేశారు. గంపలగూడెంలో నాలుగు పరీక్ష కేంద్రాలు, ఊటుకూరులో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, ప్రభుత్వ పాఠశాలల నుండి 554 మంది విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల నుండి 245 మంది విద్యార్థులు మొత్తం 799 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఈ వివరాలను స్థానిక విద్యాశాఖ అధికారి వెల్లడించారు.

ఎన్‌టిటిపిఎస్ నూతన చీఫ్ ఇంజినీర్‌గా నాగరాజు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కడప రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ సిఇగా పనిచేస్తున్న నాగరాజు ఎన్‌టిటిపిఎస్‌కు బదిలీ అయ్యారు. ఎన్‌టిటిపిఎస్‌లో సిఇగా బాధ్యతలు నిర్వహిస్తున్న నవీన్ గౌతమ్ విద్యుత్ సౌధాకు బదిలీ అయి బాధ్యతలు స్వీకరించారు.

జగనన్న కాలనీలో సౌకర్యాలు కరువు

ప్రజాశక్తి - విసన్నపేట : మండలంలో ఇచ్చిన జగనన్న కాలనీ ఇళ్ల స్థలాలు సెంటుకు ఒక ఇల్లు అని చెప్పి అక్కడ డ్రెయినేజీలు గానీ కరెంటు సప్లై కానీ, విద్యుత్ సౌకర్యం గానీ లేవని జనసేన పార్టీ మండల అధ్యక్షులు యాసిన్ అన్నారు. శుక్రవారం జగనన్న స్థలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎటువంటి అభివద్ధి పనులు, మౌలిక సదుపాయాలు లేక స్థలాలన్నీ అడవిని తలపిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ టౌన్ అధ్యక్షులు నందమూరి వెంకటేశ్వరావు, మండల ఉపాధ్యక్షులు అడపా శ్రీనువాసరావు ,తేజ మండల కార్యదర్శి తోట కిషోర్, తోట కష్ణ, మండల నాయకులు పాల్గొన్నారు.

రూ.3.5 కోట్లతో టిటిడి కళ్యాణ మండపం నిర్మాణం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని చిల్లకల్లు రోడ్డు తొర్రగుంటపాలెంలో రూ.3.5 కోట్లతో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న టిటిడి కల్యాణ మండప ఏర్పాట్లను శుక్రవారం ప్రభుత్వవిప్, స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ టిటిడి కళ్యాణమండపం లేక, ప్రైవేటు ఫంక్షన్ హాల్స్ ధరలు భరించలేక సామాన్య, మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుండగా గమనించిన తాను ఎలాగైనా తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణమండపం ఏర్పాటు చేయాలని స్థలాన్ని సేకరించి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.

ఉపాధి కార్మికులకు మెడికల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - తిరువూరు : వేసవి ఎండలను దష్టిలో పెట్టుకొని మండలంలోని పలు గ్రామాల్లో పనిచేసే ఉపాధి కూలీలకు అత్యవసర మందులను అందుబాటులో ఉంచినట్లు ఇన్చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం కూలీలకు మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. పని ప్రదేశంలో వీటిని అందుబాటులో ఉంచాలని, వడదెబ్బకు గురైన, అనారోగ్యం పాలిన పడినా ఈ మందులను వినియోగించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు ఆదేశాల మేరకు అన్ని గ్రామా లకు ఈ కిట్లను అందజేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ మున్ని చౌటపల్లి, రాజు గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ కె.పూజిత, కనక దుర్గ భవాని పాల్గొన్నారు.

ఐన్‌స్టీన్, హాకింగ్‌కు నివాళి

ప్రజాశక్తి - తిరువూరు : ప్రముఖ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జయంతి, మరో ప్రముఖ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ వర్థంతిని పురస్కరించుకుని తిరువూరు సర్వోదయ విద్యాలయంలో గురువారం రాత్రి జన విజ్ఞానవేదిక (జెవివి) ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించారు. వారి చిత్ర పటాలకు పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ మాట్లాడుతూ సైన్స్ పరిశోధనలను మానవ వినాశనానికి గాకుండా, మానవ వికాసానికి ఉపయోగించేలా పాలకులు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.రాంప్రదీప్, మండల ప్రధాన కార్యదర్శి డి.సుదర్శన్, జన విజ్ఞాన వేదిక ప్రతినిధి కె.స్వామి తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సామినేనిని సన్మానిస్తున్న మహిళలు

ఉదయభానును కలిసిన మహిళలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని అనుమంచిపల్లి ఎస్‌సి కాలనీకి చెందిన పలువురు మహిళలు ప్రభుత్వ విప్ శాసన సభ్యులు సామినేని ఉదయభానుని పట్టణం లోని ఉదయభాను స్వగృహంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో జగన్‌కు ఉదయభానుకి అండగా నిలుస్తామని అనుమంచిపల్లి గ్రామం నుండి మంచి మెజారిటీ అందిస్తామని తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : తిరుమలగిరిలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిత్యాన్నదానికి రూ.25,116లు విరాళంగా దాతలు అందజేశారు. నందిగామకు చెందిన తుర్లపాటి వెంకట శశి కళాధర్‌రావు దంపతులు ఈ విరాళం శుక్రవారం అందజేశారు. వారికి స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్, బోర్డు మెంబెర్స్ నెల్లూరి రమా రాం బాబు, చింతల నరసింహారావు అందజేశారు.

ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

హెచ్‌ఎం ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - విసన్నపేట : ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందుతున్న మేసుపాం ఆదాంను నాగులూరు స్కూల్ ప్రాంగణంలో ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా గంధం రామారావు మాస్టారు మాట్లాడుతూ ఆదాం 28 సంవత్సరాల పదవీకాలంలో ఎటువంటి రిమార్కు లేకుండా చేయడం చాలా గొప్ప విషయమనీ, ఆయన చేతులతో ఎంతోమందిని విద్యావంతులుగా తీర్చిదిద్దారని, విదేశాలకు కూడా వీరి శిష్యులను పంపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు ఎం వరలక్ష్మి, డిటిఎఫ్ ఎ.కొండూరు మండలాధ్యక్షుడు తోనూరు యాకోబు, శ్రీనివాసరావు, గంధంశెట్టి సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు శిలువ మోస్తూ ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి వీరులపాడు : జుజ్జూరు గ్రామంలో ఆర్‌సిఎం చర్చి ఉత్తర హరిజనవాడలో ఏసు క్రీస్తు శిలువను మోస్తూ శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు ప్రతి సంవత్సరం క్రైస్తవ సంప్ర దాయాల ప్రకారం సిలువ మార్గం కార్యక్రమం పలు వీధుల్లో నిర్వహిస్తుంటారు. ఈ కార్యక్రమంలో జగన్నాథ పురం విచారణ గురువు పాల్గొ న్నారు. అనం తరం గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్చి సంఘ పెద్దలు ప్రసాద్, తిరుపతిరావు, విశాఖ రమేష్, శాంత, మధు, తదితరులు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్‌లో...

తోట్లవల్లూరులో...

మచిలీపట్నంలో...

సిఎఎ రద్దు చేయాలని నిరసనలు

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్‌: ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో సిఎఎ ద్వారా మత విద్వేషాలు రెచ్చగొట్టాలని కేంద్రం ప్రభుత్వం చూస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్‌.బాబూరావు విమర్శించారు. సిఎఎను రద్దు చేయాలని, మత సామరస్యాన్ని కాపాడాలని కోరుతూ శుక్రవారం నూర్‌ ఇస్లాం మక్కా మసీద్‌ వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ఇది ముస్లిములకు మాత్రమే సంబంధించిన సమస్య కాదని భారతదేశ ప్రజలందరికీ సంబంధించినదని అన్నారు. అందరికీ పౌరసత్వం ఇస్తే అభ్యంతరం లేదుకానీ మతాల ప్రాతిపదికగా పౌరసత్వం ప్రతిపాదించడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ విధానంతో దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పాలవుతారన్నారు. ముస్లిములు, గిరిజనులు, దళితులపై కూడా ఈ ప్రభావం ఉంటుందన్నారు. ఇటువంటి రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అమలు చేసే హక్కు కేంద్రానికి లేదని స్పష్టం చేశారు. దీనిని ప్రజలందరూ ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బిజెపితో జతకట్టిన పార్టీలకు సిఎఎ మీద ఉన్న వైఖరి ఏమిటనేది ప్రజలకు తెలియజేయాలని, వైసిపి పరోక్షంగా బిజెపితో అంటకాగుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, సిపిఎం ఎన్టీఆర్‌ జిల్లా కమిటీ సభ్యులు భూపతి రమణారావు, కె.దుర్గారావు నూర్‌ ఇస్లాం మసీద్‌ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.రసూల్‌, స్థానిక ముస్లిం పెద్దలు ఎస్‌కె.రహీం, మహబూబ్‌ వలీ, ఎస్‌కె రషీద్‌, ఎస్‌కె బాషా, నిజాముద్దీన్‌ పిఎస్‌ఎన్‌.మూర్తి పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని శుక్రవారం తోట్లవల్లూరు ప్రధాన సెంటర్లో ముస్లిం మైనారిటీ నాయకులు, సిపిఎం నాయకులు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల పౌర హక్కులకు భంగం కలుగుతుందని, అనేక వ్యవస్థలు చిన్న భిన్నం అవుతున్నాయని, దేశం అతలాకుతలం అయిందని కృష్ణా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు శీలం ప్రకాష్‌రావు అన్నారు. ఈ బిల్లు ప్రవేశపెట్టడం వల్ల కుల, మతాల వారీగా ప్రజలను విభజించి వారి మధ్య విభేదాలు సృష్టించడం బిజెపి లక్ష్యమన్నారు. విభజించి పాలించే రీతిలో బిజెపి అనవసరిస్తున్న విధానాలను తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జుజ్జువరపు ఏసేపు, ఈడుపుగంటి డేవిడ్‌ రాజు, ఎండి హుస్సేన్‌, ఎండి గౌస్‌, అబ్దుల్‌ సత్తార్‌, వహీదుల్లా, ఆసిఫ్‌ బాషా తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం రూరల్‌: సిఎఎను కేంద్ర ప్రభుత్వం మళ్లీ తెరమీదకు తేవడం కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని ప్రజాసంఘాల నాయకులు మండిపడ్డారు. మచిలీపట్నంలోని స్థానిక చింత చెట్టు సెంటర్‌ వద్ద శుక్రవారం మధ్యాహ్నం భారత రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మూడు సంవత్సరాల క్రితం ఆందోళనలు నిర్వహించడంతో సిఎఎపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌ వచ్చే సమయం చూసి రాజకీయ లబ్ధి కోసం బిజెపి ప్రభుత్వం సిఎఎ యాక్ట్‌ను మళ్లీ తెర మీదకు తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొడాలి శర్మ, సిపిఐ నాయకులు మోదుమూడి రామారావు, లింగం ఫిలిప్‌, జమియా మసీదు అధ్యక్షులు ఎండి అంజద్‌ పాషా, టిడిపి నాయకులు మహమ్మద్‌ బాజాని, ముస్లిం జెఎసి నాయకులు ఎండి ఫిరోజ్‌ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిములతో మాట్లాడుతున్న రఘు

సిఎఎపై కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం: సిఎఎను వ్యతిరేకించాలని కోరుతూ శుక్రవారం గన్నవరం మసీదు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ముస్లిం పెద్దలతో మాట్లాడటంతో పాటు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌.రఘు మాట్లాడుతూ బిజెపి రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలని వామపక్షాలు పిలుపునిచ్చాయని తెలిపారు. ప్రజలకు సిఎఎ ప్రమాదాన్ని అర్థమయ్యేలా చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు కాట్రగడ్డ జోషి, మీరా ఖాన్‌, వరాన్‌ సర్దార్‌, దాదా, మల్లంపల్లి ఆంజనేయులు, మిరప నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రస్ట్‌ బోర్డ్‌ మెంబర్‌గా మహేందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భవానీ పురం: పశ్చిమ నియోజకవర్గంలోని రూపా బాయమ్మ ట్రస్ట్‌ బోర్డ్‌ మెంబర్‌ గా విజయవాడ 43వ డివిజన్‌ ఊర్మిళానగర్‌కు చెందిన వైసీపీ నాయకులు గట్ల మహేందర్‌ రెడ్డి నియమితులయ్యారు. ప్రజల్లో మంచి గుర్తింపు పొందిన మహేందర్‌ రెడ్డిని రూపా బాయమ్మ ట్రస్ట్‌ బోర్డు మెంబర్‌గా నియమించినందుకు ఆయనకు పలువురు వైసిపి నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌ రెడ్డిని శుక్రవారం పశ్చిమ ఇంచార్జి షేక్‌ ఆసిఫ్‌, 43 వ డివిజన్‌ కార్పొరేటర్‌ బాపతి కోటి రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా మహేందర్‌ రెడ్డి మాట్లాడుతూ ట్రస్ట్‌ బోర్డు ధర్మకర్తగా తన నియామకానికి సహకరించిన మాజీ మంత్రి,విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, వైసీపీ పశ్చిమ నియోజకవర్గం ఇన్చార్జి షేక్‌ ఆసిఫ్‌, 43వ డివిజన్‌ కార్పొరేటర్‌ బాపతి కోటిరెడ్డి ,తదితర వైసిపి నాయకులకు కతజ్ఞతలు తెలియజేశారు. రూపా బాయమ్మ ట్రస్ట్‌ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

మసీదు సందర్శన

ప్రజాశక్తి-చల్లపల్లి: చల్లపల్లి నారాయణరావునగర్‌లోని గౌసియా మస్జీద్‌ను మచిలీపట్నం వైసీపీ ఇంచార్జి డాక్టర్‌ చంద్రశేఖర్‌, సింహాద్రి రామ్‌చరణ్‌ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణరావు నగర్‌ కాలనీలోని ముస్లింల శ్మశానవాటిక అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో 23 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-తిరువూరు: స్థానిక శ్రీవాహిని ఇంజనీరింగ్‌ కళాశాలలో శుక్రవారం జరిగిన ప్రాంగణ ఎంపికలలో 23 మంది బిటెక్‌ విద్యార్థులు ఉద్యోగాలు పొందినట్లు ప్రిన్సిపాల్‌ రంగ నాగేం ద్రబాబు తెలిపారు. టీసీఎస్‌ సుందరం సంస్థ మెకానికల్‌, ఎలక్ట్రికల్‌ విభాగాల్లో రాత పరీక్ష, బృంద చర్చల ద్వారా అభ్యర్థుల ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇటీవల తమ కళాశాలలో మాల్‌ టెక్‌ సంస్థ కూడా ఇంటర్వ్యూలు నిర్వహించి నలుగురు విద్యార్థులను ఎంపిక చేసిందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మృతి

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం బాలికల ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు వరలక్ష్మి (50) రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. గురువారం విధి నిర్వాహణ పూర్తి చేసుకుని తన ద్విచక్ర వాహనంపై విజయవాడ వెళుతుండగా కేసరపల్లి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఏలూరు వైపు నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టగా తీవ్ర గాయాలపాలై ఆమె మరణించారు. ఆమె మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

శ్రీహరికోట స్పేస్‌ సెంటర్‌ సందర్శన

ప్రజాశక్తి-వన్‌టౌన్‌: విజయవాడలోని పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజ్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్నాలజీకి చెందిన ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్‌ ఇంజినీరింగ్‌ (ఈసిఈ) విభాగానికి చెందిన విద్యార్థులు శ్రీహరికోటలోని ఇస్రో స్పేస్‌ సెంటర్‌ను సందర్శించారు. ఈ నెల 14న విద్యార్థులు ఇస్రో అంతరిక్ష కేంద్రంలోని సౌకర్యాలు, పురోగతులను అన్వేషించారు. అకడమిక్‌ కరిక్యులమ్‌కు అనుగుణంగా అంతరిక్ష పరిశోధన, సాంకేతికత డొమైన్‌కు ఆచరణాత్మకంగా బహిర్గతం చేయడం ఈ పర్యటన లక్ష్యమని కళాశాల ప్రిన్సిపాల్‌ తెలిపారు. విద్యార్థులు భారతదేశ అంతరిక్ష యాత్ర వెనుక ఉన్న అధునాతన మౌలిక సదుపాయాలు, నియంత్రణ వ్యవస్థలు, సంచలనాత్మక భావనలను ప్రత్యక్షంగా చూసే అవకాశం లభించిందని, ఇస్రోలోని శాస్త్రవేత్తలు మరియు ఇంజనీర్‌లతో సంభాషించడం ద్వారా వారు అంతరిక్ష పరిశోధన, ఉపగ్రహ సాంకేతికత విలువైన సమాచారాన్ని పొందారని ఈసిఈ విభాగాధిపతి ఎ.వి.కిరణ్మయి తెలిపారు.

మహిళా మార్ట్‌ నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గుడివాడరూరల్‌: గుడివాడ మండలం బొమ్ములూరులోని టిడ్కో కాలనీలో రూ.కోటి 35లక్షల మెప్మా నిధులతో నిర్మించనున్న జగనన్న మహిళా మార్ట్‌ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే కొడాలి నాని శుక్రవారం ప్రారంభించారు. కాలనీలోని రిజర్వ్‌ సైటులో మహిళా మార్ట్‌ నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించి ఎమ్మెల్యే నాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ మహిళా మార్ట్‌ నిర్మాణం పూర్తయిన తర్వాత మెప్మా పర్యవేక్షణలో, డ్వాక్రా మహిళలకు అప్పగిస్తామన్నారు. భవనంలో ప్రజలకు అవసరమయ్యే వివిధ రకాల ఉత్పత్తులు హోల్‌ సేల్‌, రిటైల్‌గా అందుబాటులో ఉంటాయన్నారు. టిడ్కో కాలనీలో విద్యుత్‌, త్రాగునీటి సమస్యలు ఉన్నాయన్నారు. విద్యుత్‌ సమస్య పరిష్కారానికి మూడు కోట్లతో సోలార్‌ కరెంటు ప్రాజెక్ట్‌ మంజూరైందని, ఇప్పటికే టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని వారం రోజుల్లో పనులు మొదలవుతాయని ఎమ్మెల్యే నాని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గద్దె పుష్పరాణి, పట్టణ వైసీపీ అధ్యక్షుడు గొర్ల శీను, మార్కెట్‌ యార్డ్‌ చైర్మన్‌ మట్టా నాగమణి జాన్‌ విక్టర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం నియోజకవర్గ కేంద్రం గన్నవరం మండల తహసీల్దార్‌ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి అన్ని పోలింగ్‌ కేంద్రాల ద్వారా ఈ నెలలో ఇప్పటివరకు అందిన అన్ని రకాల ఓటరు దరఖాస్తుల జాబితాలు, పరిష్కారం వివరాలు అందజేసే నిమిత్తం నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం శుక్రవారం గన్నవరం మండల తహసీల్దార్‌ ఎన్‌.ఎస్‌.పవన్‌ కుమార్‌ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో గన్నవరం నియోజకవర్గ టిడిపి పోల్‌ మేనేజ్మెంట్‌ కో-ఆర్డినేటర్‌ ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు, సిపిఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ గత సమావేశాలలో అనేకసార్లు వివిధ రాజకీయ పార్టీల తరపున నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న 306 పోలింగ్‌ స్టేషన్లకు సంబంధించి సిఎం జగన్‌ చిత్రపటం, వైసిపి రంగులను ఇంకనూ తొలగించలేదని గుర్తు చేశారు. ఇది కొనసాగిస్తే రేపు పోలింగ్‌ లో ఓటర్ల మీద ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అలాగే మృతుల ఓట్లను కూడా జాబితా నుంచి తొలగించాలని కోరారు.

రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న తహశీల్దార్‌

క్రీడా సంఘాలకు ప్రభుత్వ సహకారం కరువు

ఏపిఒఎ అధ్యక్షుడు పురుషోత్తం

ప్రజాశక్తి-హెల్త్‌ యూనివర్సిటీ: జాతీయ క్రీడలు నిర్వహిస్తే తప్ప రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాలు మెరుగుపడవని ఆంధ్రప్రదేశ్‌ ఒలింపిక్‌ సంఘం (ఏపిఒఎ) అధ్యక్షుడు ఆర్కే పురుషోత్తం పేర్కొన్నారు.రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏపీఓఏతో కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. గత ఐదేళ్లుగా ఏపీఓఏకు ప్రభుత్వం నుంచి ఎలాంటి

మాట్లాడుతున్న పురుషోత్తం

సహకారం అందడంలేదని వాపోయారు. విజయవాడ గాంధీనగర్‌లోని హోటల్‌ ఐలాపురంలో శుక్రవారం ఏపీఓఏ ఎగ్జిక్యూటివ్‌ కమిటీ (ఈసీ) సమావేశం జరిగింది. రాబోయే వార్షిక జనరల్‌బాడీ సమావేశం, 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్‌, ఖాతాలను ఆమోదించడం, జిల్లా ఒలింపిక్‌ అసోసియేషన్‌లకు పెండింగ్‌లో ఉన్న ఎన్నికలు వంటి పలు అంశాలపై చర్చించారు. అనంతరం పురుషోత్తం మీడియాతో మాట్లాడుతూ జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు సంబంధించి ఏపీఓఏకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదన్నారు. ఇంకా క్రీడా సంఘాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహకారం అందడం లేదని ఆరోపించారు. అదనంగా ప్రభుత్వం ఏపిఒఎకు రాజకీయంగా ఇబ్బందులను సృష్టిస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఒఎ సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ ఎన్‌ బ్రహ్మాజీ, సిఇఒ సిహెచ్‌ గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడకు స్వాగతం పలుకుతున్న ఆకుల శ్రీనివాస్, తదితరులు

ముద్రగడకు స్వాగతం

ప్రజాశక్తి - భవానీపురం : తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లేందుకు వచ్చిన ముద్రగడ పద్మనాభంకు కనకదుర్గమ్మ వారధి వద్ద ఆకుల శ్రీనివాస్ కుమార్ స్వాగతం పలికారు. శ్రీనివాస్ వెంట పలువురు వైసిపి నాయకులు పొదిలి చంటిబాబు, అల్లం పూర్ణచంద్రరావు, మేళం చిన్న, మోదుగ శివ తదితరులు ఉన్నారు.

ఆందోళన చేస్తున్న యాదవ సంఘం నాయకులు

బిజెపి పశ్చిమ టికెట్ రవికృష్ణకు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రానున్న ఎన్నికల్లో బిజెపి విజయవాడ పశ్చిమ టికెట్‌ను యాదవ సామాజిక వర్గ నాయకులు గొలగాని రవికృష్ణకు కేటాయించాలని యాదవ సంఘం నాయకులు బిజెపి నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కొత్తపేటలోని యాదవ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యాదవ సంఘం నాయకులు మాట్లాడారు. తొలుత యాదవ సంఘం నాయకులు బోను సత్యనారాయణ యాదవ్ (సత్తిబాబు) మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నారై గొలగాని రవికృష్ణ 15 ఏళ్ల నుంచి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు అండదండగా నిలిచారని అన్నారు. విజయవాడ పశ్చిమంలో యాదవుల సామాజిక వర్గానికి 35 వేలకు పైగా ఓట్లు ఉన్నాయన్నారు. యాదవ కళ్యాణ మండపం కార్యదర్శి మురపాల దుర్గారావు యాదవ్, యాదవ సంఘం నాయకులు కోలా ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ రవికృష్ణకు సీటు ఇవ్వాలని బిజెపి నాయకత్వాన్ని కోరారు. సమావేశంలో యాదవ సంఘం నాయకులు బోను జయశంకర్ యాదవ్, పక్కుర్తి రామకష్ణ యాదవ్, కిలాడి కామేష్ యాదవ్, పల్లా మురళి యాదవ్, ఒమ్మి రమణ యాదవ్, ఇప్పిలి కేశవరావు యాదవ్, ఒమ్మి వెంకటేశ్వరరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : స్థానిక శాంతినగర్లోని భాస్కర్ కొట్టు సమీపంలో నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు పక్కనే స్కూల్ ఉండటం, దానిచుట్టూ చెట్లు పెరిగి ప్రమాదకరంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేయాలని కోరుతున్నారు. ఎల్‌బిఎస్ నగర్‌లో ఉన్న కాల్వకట్టపై ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని చెబుతున్నారు. చిన్న గాలి వచ్చినా చెట్టు విరిగి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో కరెంటు పోతుందని స్థానికులు వాపోతున్నారు. ఈ రెండు ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పశ్చిమలో విఎంసి కార్యాలయాలు ప్రారంభం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ సర్కిల్ –వన్‌లో విఎంసి కార్యాలు శుక్రవారం ప్రారంభించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 47వ డివిజన్‌లోని కలరా హాస్పిటల్ దగ్గర గల సర్కిల్ –1 మునిసిపల్ కార్యాలయంలో రూ.16.54 లక్షల మునిసిపల్ సాధారణ నిధులతో నిర్మించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, సుమారుగా రూ.17.35 లక్షల మునిసిపల్ సాధారణ నిధులతో నిర్మించిన శానిటరీ సూపర్‌వైజర్ కార్యాలయం ప్రారంభమయ్యాయి. ఎపి స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్‌పర్సన్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త షేక్ ఆసిఫ్, నగర, మేయర్ భాగ్యలక్ష్మి, 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి బిసి డైరెక్టర్ దేరంగుల వెంకటరమణ, కూరాకుల నాగ, వెంకటేష్ జోషి, పాండు, శివ రాజేష్, మునిసిపల్ అధికారులు, పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి, తదితరులు

దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి కొట్టు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వారు ఆలయానికి విచ్చేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామరావు ఆలయ మర్యాదలతో వీరికి స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ చైర్మన్, కార్యనిర్వాహణాధికారి అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలు, చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మకు బంగారు కాసుల పేరు అందజేత



విజయవాడకు చెందిన గంధం రాజేష్ కుటుంబ సభ్యులు దుర్గమ్మకు కానుకగా 43 గ్రాముల బంగారు కాసుల పేరును ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.రామరావును శుక్రవారం కలిసి దేవస్థానానికి విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు దాత కుటుంబానికి అమ్మవారి దర్శనం కల్పించగా, వేదపండితులు వేదాశీర్వచనం చేయగా చైర్మన్, కార్యనిర్వాహనాధికారి శ్రీ అమ్మవారి ప్రసాదములు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - భవానీపురం : వినియోగదారులు తమ హక్కులు, బాధ్యతలు, రక్షణ, దరఖాస్తు విధానం, కృత్రిమ మేధ ద్వారా రక్షణ వంటి విషయాలపై అవగాహన కలిగి ఉండాలని కన్స్యూమర్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం దళవాయి సుబ్బరామయ్య నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ సంబంధిత చార్ట్స్ ఉపయోగించి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం నగరంలో జరిగిన రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని బహుమతులు అందుకున్న ముగ్గురు విద్యార్థులను ఆయనతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాతంగి కోటయ్య అభినందించారు. ఈ సందర్భంగా మాతంగి కోటయ్య మాట్లాడుతూ వినియోగదారుల క్లబ్ కార్యక్రమాల గురించి తెలుసుకున్న విషయాల గురించి విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, అదే ఈ క్లబ్ ధ్యేయం అని అన్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ క్లబ్ ఆధ్వర్యంలో యూట్యూబ్ ద్వారా అవగాహనా వీడియోలను రూపొందించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఇలాగే కొనసాగాలని ప్రోత్సహించారు.

పౌర సరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ అరుణ్‌కుమార్ నుంచి బహుమతులు అందుకుంటున్న విద్యార్థిని

బ్యూటీ పార్లర్లు, సెలూన్లు తనిఖీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కమిషనర్ కాంత్ రానా టాటా ఆదేశాల మేరకు విజయవాడ వెస్ట్ ఎసిపి పడాల మురళీకృష్ణ రెడ్డి పర్యవేక్షణలో విజయవాడ వన్‌టౌన్ సిఐ ద్వారంపూడి దుర్గా శేఖర్ రెడ్డి, సిబ్బంది, మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ, లేబర్ ఆఫీసర్, చైల్డ్ అండ్ వెల్ఫేర్ వారందరితో కలిసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బ్యూటీ పార్లర్, సులూన్‌లను శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సిఐ దుర్గా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ బ్యూటీ పార్లర్, మసాజ్ సెంటర్ల పేరుతో అసాంఘిక కార్య కలాపాలను నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలకు ఏదైనా సమాచారం తెలిస్తే 100కు గానీ, 112కు గాని విజయవాడ వన్‌టౌన్ సిఐ నెంబర్‌కు గానీ వివరాలను తెలియజేయాలని సూచించారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సిఐ తెలిపారు.

ముస్లిం సోదరులతో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఆసిఫ్

ఇమామ్, మౌసన్లను మోసం చేశారు : ఆసిఫ్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : తన హయాంలో మసీదు ఇమామ్, మౌసన్లకు కేవలం మూడువేలు, అయిదు వేలు చొప్పున అరకొరగా ఇస్తూ చంద్రబాబు మోసం చేశారని వైసిపి పశ్చిమ ఇన్‌ఛార్జి షేక్ ఆసిఫ్ విమర్శించారు. రంజాన్ మాసం తొలి శుక్రవారం సందర్భంగా పున్నమి ఘాట్ వద్ద గల మోహమ్మదీయ మసీదులో పశ్చిమ వైసిపి ఇన్‌ఛార్జి షేక్ ఆసిఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మెన్ షేక్ గౌస్ మొహిద్దిన్ పాటుతో కలిసి ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డి, మసీదు ముతవల్లి ఎండి అస్గర్, బడేమియా తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడికి తరలివచ్చిన యాత్రికులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి, దుర్గమ్మ దేవాలయానికి శుక్రవారం సందర్భంగా అమ్మవారి, స్వామి వారి దర్శనార్థం యాత్రికులు విశేషంగా విచ్చేశారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈ.ఓ ఎస్ రామారావు ఏర్పాట్లును పరిశీలించారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

ప్రజాశక్తి, వన్ టౌన్ : నగరంలోని వన్‌టౌన్ ప్రాంతాలకు వేసవిలో నీటి సరఫరా అరకొరగా ఉంటుంది ఎంసిపిఐ (యు) సిటీ కార్యదర్శి కాసాని గణేష్‌బాబు శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గుక్కెడు నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాల్సిన నగర పాలక సంస్థ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్పొరేషన్ అధికారులు ఇప్పటికైనా స్పందించి నగర ప్రజలకు తాగునీటి సమస్యను సమీక్ష చేసి లోపాలను సరిచేసి నీరు అందించాలని కోరుతున్నామన్నారు.

పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిఎన్‌టియుసి కార్యదర్శి మాడుగుల సురేష్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నియోజకవర్గ స్థాయి పాస్టర్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పాస్టర్స్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం పాస్టర్లకు నూతన వస్త్రాలను మాడుగుల సురేష్ బహూకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రేమ విందులో సురేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దేవాలయ ధ్వజ శిఖరానికి లక్ష విరాళం

ప్రజాశక్తి - కంచికచర్ల : నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి జగన్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ అన్నారు. కంచికచర్లలో వినాయకుని దేవాలయంలో ధ్వజ శిఖరానికి లక్ష రూపాయల విరాళాన్ని శుక్రవారం తన కార్యాలయంలో ఆలయ నిర్వాహకులకు అందజేశారు. అనంతరం 30 మంది నాయీ బ్రాహ్మణులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల ఉప సర్పంచ్ వేమా సరేష్ బాబు పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయని బిజెపి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : తెలంగాణ ముస్లిములకు ఉన్న 4శాతం రిజర్వేషన్లు తీసివేస్తామని చెప్పి ప్రచారం చేస్తూ ఎన్నికలకు వెళ్లిన బిజెపితో కలిసి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ముస్లిములకు ఏం చెబుతారో తెలపాలని రెడ్డిగూడెం వైస్ ఎంపిపి, వైసిపి సీనియర్ నాయకుడు చాట్ల రాబర్ట్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విభజన హామీలు అమలు చేయడంలో బిజెపి చేసిన వంచన ఆంధ్రప్రదేశ్ ప్రజలు మరిచిపోలేదని, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి ఈ రాష్ట్రానికి బిజెపి చేసిన అన్యాయాన్ని ప్రశ్నించకుండా ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని గుజరాత్ వారికి తాకట్టు పెట్టారని విమర్శించారు. తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

వీరపనేనిగూడెం చెరువులో
అక్రమంగా మట్టి తవ్వకాలు

- కన్నెత్తి చూడని అధికారులు
- యథేచ్ఛగా తరలుతున్న మట్టి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం వీరపనేని గూడెం ములగలమ్మ చెరువులో అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డే లేకుండా పోతుంది. గత కొన్ని రోజులుగా రాత్రి వేళలో ఈ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. అక్రమ సంపాదనకు అలవాటు పడిన వ్యక్తులు సొంత ప్రొక్లైన్, ట్రాక్టర్లతో మట్టి తవ్వి ఇటుక బట్టీలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని విమర్శిస్తున్నారు. రైతులు అడిగిన పారేడు మట్టి వేయడం లేదని చెప్తున్నారు. చెరువు మట్టి పలువురికి కాసుల వర్షం కురిపిస్తుందని, అధికారుల అండదండ లతో ఈ అక్రమ మట్టి తవ్వకాలు యధేచ్ఛగా చేస్తున్నాడని స్థానిక రైతులు చెబుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు నిరాటంకంగా జరిగిపో తున్నాయి. రాత్రి వేళల్లో ప్రొక్లైన్ పెట్టి మట్టి తవ్వేస్తున్నారు. పగటిపూట యంత్రం తీసుకువెళ్లి పక్కనే ఉన్న మామిడి తోటలో పెట్టేస్తున్నారు. ఈ తవ్వ కాలకు అనుమతులు లేవు అని మైనర్ ఇరిగేషన్ అధికారులు చెబుతున్నా గాని నల్ల మట్టి యదేచ్ఛగా తరలిపోతుంటే చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యాడు. అదేమని సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే మళ్ళీ తవ్వకాలు జరిపే వారినే సమర్థిస్తూ వెనకేసుకురావడం కోసు మెరుపు. శాఖాపరమైన అనుమతులు లేవని, అదేమంటే అధికార పార్టీ నేత పేరు అడ్డం పెట్టుకుని ఈ దందాకు పాల్పడుతున్నారని గ్రామానికి చెందిన రైతులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. అక్రమార్కులకు మట్టిని అమ్ముకొని జేబులు నింపుకుంటున్నారని వాదన ఉంది. మట్టి దొంగలకు ప్రభుత్వమే దారులు తెరిచినట్లుగా ఈ వ్యవహారం ఉందని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న ఇటుక పట్టీలకు తరలించి ఎకరాల్లో మేటలు వేస్తున్నారు. ఇది సీజన్ కావడంతో ఇటుక పట్టిన నిర్వాహకులు నల్ల మట్టిని కొనుగోలు చేసి పెద్ద కొండలుగా నిలువ చేసుకుంటున్నారు. వేసవికాలం మొదలైన దగ్గర నుంచి ఈ చెరువులో విడతలవారీగా మట్టిని మాయం చేస్తున్నారు. మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకున్న వ్యక్తులు జల్సాగా తిరుగుతున్నారని గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలే చెప్పడం గమనార్హం. మట్టి తవ్వకం దారులు గ్రామాల పరిధిలోని అధికారులను మేనేజ్ చేసుకుంటున్నారని విమర్శ ఉంది. వారికి మామూలు ఇచ్చి దర్జాగా మట్టి కొట్టేస్తున్నారు. ఈ విషయమై ఓ గ్రామస్థాయి అధికారికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. ఇంకో అధికారిని అడిగితే అనుమతుల గురించి తమకు ఏం తెలియదు అన్నట్టు మాట్లాడారు. ఇప్పటికైనా ఈ మట్టి దొంగలపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

సరుకులు పంపిణీ చేస్తున్న ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : యువతలో దయ, త్యాగం, సహాయం వంటివి వచ్చే విధంగా స్వచ్ఛంద సంస్థలు వారిని భాగస్వాములు చేయాలని ఉయ్యూరు సీఐ ఎండి హబీబ్ బాషా అన్నారు. రంజాన్ మాసం పురస్కరించుకుని ఎంకె అసోసియేట్స్ కార్యాలయం వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు శుక్రవారం నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రంజాన్ మాస పవిత్ర ఉపవాస దీక్షల సందర్భంగా పేద కుటుంబాలకు లయన్ క్లబ్ ఇటువంటి సాయం చేయడం ప్రశంసనీయమన్నారు. క్లబ్ జిల్లా ట్రెజరర్ నూకల వెంకటసాంబశివరావు, జోనల్ చైర్మన్ రామసత్యకిషోర్, కార్యదర్శి నల్లా శ్రీనివా స్, ట్రెజరర్ వూర కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి : రాష్ట్ర ప్రగతికి, పేదరిక నిర్మూలనకు బాటలు వేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావటం ఖాయ మని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చల్లపల్లి , వక్కలగడ్డ పాగోలు, లక్ష్మీపురం గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీలను సింహాద్రి రమేష్ బాబు, సింహాద్రి వికాస్ బాబు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభిం చారు. చల్లపల్లిలో రూ.77.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ ప్రారంభించారు. వక్కలగడ్డలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు. పాగోలులో జగనన్న కాలనీకి రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు. లక్ష్మీపురంలో రూ.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైసీపీ చల్లపల్లి మండల అధ్యక్షులు శీరం వెంకట సత్యనారాయణ (నాని), మండల మహిళా కన్వీనర్ బొందలపాటి లక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, సర్పంచులు తోట శ్రీనివాసరావు, వల్లూరు ఉమా, కొల్లూరి కోటేశ్వరరావు, పైడిపాముల కష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి-పెదపారుపూడి : దాతల సహకారం మరువలేని ప్రధానోపాధ్యాయుడు హరి కిషోర్ అన్నారు. శుక్రవారం వెంట్రుప్రగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వం విద్యార్థి పలగాని సాయి పదో తరగతి విద్యార్థులకు పరీక్ష రాయుటకు జామెంట్రీ బాక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఫ్యాడ్ 50 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

మోటూరులో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-గుడివాడరూరల్ : గుడివాడ మండలం మోటూరులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం టిడిపి నాయకులు వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వెనిగండ్ల రాముకు టిడిపి జనసేన పార్టీల నాయకులు స్వాగతం పలికారు. శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వెనిగండ్ల రాము స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని, టీడీపీ జనసేన సూపర్ సిక్స్ మేనిఫెస్టో అంశాలను వివరించారు. గ్రామంలోని భగీరథ మహర్షి, వంగవీటి మోహన రంగా, మాజీ ఎమ్మెల్సీ ఘంటా కష్ణమూర్తి విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మండల టిడిపి అధ్యక్షులు వాసే మురళి, గుడివాడ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జి, సీనియర్ టిడిపి నాయకులు డాక్టర్ గోర్జి సత్యనారాయణ, గోవాడ శివ, కర్రే వెంకటగిరి ,జనసేన పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, టిడిపి నాయకులు చీకటి శేషగిరిరావు ,చీకటి పుణ్యశ్రీ, గంటా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న వెనిగండ్ల రాము

నిజాయితీగా సేవ చేసేందుకే వచ్చా

- వైసిపి మచిలీపట్నం ఎంపి అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖరరావు

ప్రజాశక్తి-ఘంటసాల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నీతి నిజాయితీగా ప్రజలకు సేవ చేయాలనే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని వైఎస్సార్సీపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు అన్నారు. మండల కేంద్రమైన ఘంటసాలలో వైఎస్సార్సీపీ నేతలు, కార్యకర్తల మండలస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖరరావు మాట్లాడుతూ 35 ఏళ్లగా క్యాన్సర్ వ్యాధి సర్జన్‌గా పని చేస్తున్నానన్నారు. నవరత్నాల ద్వారా చాలా మందికి నాణ్యమైన విద్య, వైద్యం, కూడు, గుడ్డ. అందించడమే కాక గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఇది కేవలం సీఎం జగనన్న వల్లే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో యువనేతలు సింహాద్రి వికాస్, సింహాద్రి రామ్ చరణ్, ఏఎంసీ ఛైర్మన్ వేమూరి వెంకట్రావు, జడ్పీటీసీలు తుమ్మల మురళీ కష్ణ, ఎంపీపీ. వేమూరి రజనీ కుమారి, సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దిరిశం పిచ్చేశ్వర రావు, వైస్ ఎంపిపీ కుంపటి నాగేంద్ర, సర్పంచ్లు రాచూరి ప్రసాద్ బాబు, గూడపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం జెడ్.పి.హెచ్ బాలుర హైస్కూల్ గన్నవరం బాలికల ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం ఐకాన్ ఎడ్యుకేషనల్ అకాడెమీ ద్వారా నోట్ బుక్స్ అందించారు. కాలేజ్ ప్రిన్సిపాల్ రవీంద్ర భవాని మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి క్రమశిక్షణతో నడుచుకుంటే మచి ప్రయోజకులుగా తయారవుతారన్నారు. ఐకాన్ ఎడ్యుకేషనల్ అకాడెమీ డైరెక్టర్ వీరాబత్తిన అమల దాసు మాట్లాడుతూ ప్రతి విద్యార్థినీ ఉన్నతమైన చదువుకొని ఈ సమాభివద్ధికి కషి చేయాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం నకు కాలేజ్ కాలేజ్ సిబ్బంది,హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ గారు,నాగ ప్రసాద్ గారు సుధాకర్,రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఏజీ అండ్ ఎస్ జి సిద్ధార్థ డిగ్రీకళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వ ర్యంలో శుక్రవారం విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి వైద్యపరీక్షలు చేసారు. సీని యర్ వైద్యులు పిన్నమనేని చంద్రమోహన్, కస్తూరి వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి తగు సూచనలు చేశారు. కొంతమంది విద్యార్థినులకు రక్తం ఉండవలసిన స్థాయికంటే చాలా తక్కువగా ఉన్నట్టు తేలడంతో రక్తహీనత సమస్యకు గురికాకుండా సరైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. రెడ్డిబ్బన్ క్లబ్ కో-ఆర్డి నేటర్ ఎండి నూర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శేఖర్బాబు, నరసింహారావు, ఎంఎల్ ఎస్ కుమారి తదితరులు పాల్గొని సేవలందించారు.

వెండి శఠారి బహూకరిస్తున్న దృశ్యం

వెండి ఆభరణాలు బహూకరణ

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి తెనాలి వాస్తవ్యులు గణిపిశెట్టి కార్తిక్ కుటుంబ సభ్యులు భక్తితో వెండి శఠారి - 460 గ్రాములు, వెండి ప్లేట్ - 495 గ్రాములు (విలువ సుమారుగా 80,000 రూపాయలు) ఆలయ అధికారులకు అందజేశారు. దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

గ్రూప్-1 పరీక్షలకు ఏర్పాట్లు : జెసి

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : ఈ నెల 17న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జరిగే గ్రూప్-1 పరీక్ష సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ జిల్లా కో- ఆర్డినేషన్ అధికారి గీతాంజలీ శర్మ తెలిపారు. కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం చీఫ్ సూపరెండెంట్స్ ఆయా విద్యా సంస్థల నిర్వాహకులు, సంబంధిత జిల్లా అధికారులతో గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కష్ణాజిల్లాలో 11 కేంద్రాల్లో మొత్తం 5,623 మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్షపరీక్షకు హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు. 11మంది చీఫ్ సూపరెండెంట్స్ , 11 మంది లయజన్ అధికారులతో పాటు 258 మంది ఇన్విజిలేటర్లు గ్రూప్-1 పరీక్ష నిర్వహణ కోసం నియమించినట్లు ఆమె తెలిపారు. పరీక్షలు బయో మెట్రిక్ హాజరు దష్ట్యా ఉదయం పరీక్ష కేంద్రం లోనికి అనుమతించే సమయం ఉదయం 9 గంటల నుంచి 9:30 నిమిషాల వరకు ఉందని అయితే 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్ పరిగణించి ఉదయం 9:45 నిమిషాల వరకు పరీక్ష కేంద్రంలోని అనుమతిస్తారని అన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 1: 30 నిమిషాల వరకు అనుమతిస్తారన్నారు. అయితే మరో 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్‌గా పరిగణించి 1:45 వరకు పరీక్షా కేంద్రం లోనికి అనుమతిస్తారని ఆ తర్వాత పరీక్షా కేంద్రంలో ఎట్టి పరిస్థితిలో అభ్యర్థులకు అనుమతి ఉండదన్నారు. హాల్ టికెట్ తో పాటు బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్,ప్రభుత్వ గుర్తింపు కార్డ్ లలో (పాన్ కార్డు, ఓటర్ కార్డ్, ఆధార్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ పాస్ పోర్ట్) ఏదైనా ఒకటి తీసుకొని రావాలని సూచించారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ విధించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ జి. వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సి ఈ ఓ జ్యోతిబసు, ఏపిపిఎస్సీ మానిటరింగ్ ఆఫీసర్ జయంతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి గీతాంజలి శర్మ

పేపర్ క్విల్లింగ్ ఆర్టిస్ట్ మేడా రజనికి కలెక్టర్ అభినందనలు

ప్రజాశక్తి - విజయవాడ : నగరానికి చెందిన ప్రముఖ పేపర్ క్విల్లింగ్ ఆర్టిస్ మేడా రజని కళా నైపుణ్యాన్ని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ప్రశంసించారు. గత సంవత్సరం మహానంది జాతీయ పురస్కారం, ఇటీవల మహిళా దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ-ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ మిడ్ టౌన్ వారి నుంచి ప్రత్యేక సన్మాన సత్కారాలను పొందడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మేడా రజని పేపర్లతో తాను రూపొందించిన పూల బొకే, పేపర్ క్విల్లింగ్ ఆర్ట్‌ను కలెక్టర్‌కు అందించారు.

కృత్రిమ మేధతో వినియోగదారుల హక్కులకు రక్షణ : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను ఉపయోగించడంలో నైతిక ప్రమాణాలు, నియంత్రణలు పాటించడం ద్వారా వినియోగదారుల హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడారు.

మొదటిపేజీ తరువాయి

పిఠాపురం ఘటనపై ఎందుకు స్పందించరు ? : పోతిన

చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. దీనిపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. పిఠాపురంలో పవన్‌ను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. విజయవాడ పశ్చిమ సీటును జనసేనకు ఇవ్వాలని పవన్ కళ్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. పశ్చిమలో జనసేన బలంగా ఉండడం వల్లే వైసిపి సిట్టింగ్ ఎంఎల్‌ఎను మార్చివేసి మరొకరికి ఇచ్చారని అన్నారు. జనసేన బలంగా ఉన్న చోట సీటు ఇవ్వాల్సిందేనన్నారు. ప్రజల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశానని, కేసులు పెట్టించుకున్నానని, పదవులు కార్యకర్తలను కాపాడుకోవడానికేనని అన్నారు. విజయవాడ పశ్చిమలో జనసేన క్యాడర్ ఉండాలన్నారు. ప్రతి పోరాటం విజయవాడ వేదికగా జరిగిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు బ్యాంకు సంపాదించామన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ తాను పశ్చిమ నుండి జనసేన తరపున పోటీ చేసి తీరతానని పోతిన తెలిపారు.

బిజెపికి పశ్చిమ సీటు కేటాయింపుపై ఆగ్రహం

శుక్రవారం ఆందోళనకు దిగారు. చిట్టినగర్ సెంటర్లోని కీర్తిశేషులు మరుపిళ్ల చిట్టి విగ్రహాన్ని వేదికగా చేసుకుని వందలాది మంది రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మానవహారంగా ఏర్పడ్డారు. జనసేన పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల పార్టీ ఇన్చార్జులు, కార్యకర్తలతో మహేష్ సమావేశమయ్యారు.

పోతినకు కేటాయించాలి : బిసి నేతల డిమాండ్

జనసేన శ్రేణుల నిరసనలో టిడిపి సీనియర్ నాయకులు, నగరాల సంఘం గౌరవాధ్యక్షులు రాంపిల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి పశ్చిమ నియోజకవర్గ సీటు విషయమై టిడిపి, జేనసేన, బిజెపి కూటమి నుండి బయటకు వస్తున్న వార్తలతో బిసిలు, జనసైనికులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. మొదటి నుండీ జనసేనలోనే ఉన్న పోతిన...తమ అధినేత పవన్ కళ్యాణ్‌తోనే న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో ఉన్నారని గుర్తుచేశారు. టికెట్ విషయంలో వస్తున్న వదంతులకు పవన్ కళ్యాణ్ పుల్‌స్టాప్ పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగరాలు, బిసి సంఘాల నేతలు లింగిపిల్లి అప్పారావు, రాయన ఆదిబాబు, తమ్మిన హేమంత్ కుమార్, లింగిపిల్లి రామకష్ణ, గుజ్జారి అమర్ బాబు, పోతిన సాంబశివరావు, మాకిన సత్యనారాయణ, శీరం మల్లిబాబు, కనిశెట్టి లక్ష్మణరావు, పోతిన రమేష్ పాల్గొన్నారు.

కాలుష్యంపై ఉద్యమం ఉధృతం

కోరారు. దీంతో చర్చలకు వచ్చిన అధికారులు ఈ ప్రాంత ప్రజల మనోభావాలను యాజమాన్యం దష్టికి తీసుకు వెళతామని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడంపై కూడా చర్చిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఈకార్యక్రమంలో సిపిఎం, జనసేన, ఎంసిపిఐ, బిజెపి, ఇతర సామాజిక కార్యకర్తలు, కాలుష్య నియంత్రణ పోరాట సమితి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌కు మేయర్ శంకుస్థాపన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి శుక్రవారం జక్కంపూడిలో గల ఎపి టిడ్కో - జగనన్న మహిళా మార్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రూ.1.41 కోట్ల వ్యయంతో 3 వేల చదనపు అడుగుల విస్తీర్ణంతో జగనన్న మహిళ మార్ట్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఇది మహిళలకు ఆర్థికంగా బలపరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడ్కో హౌసింగ్ ఎస్ఇ చిన్నోడు, డిఇ సనత్ కుమార్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE IV ADDL. JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S.No.1077/2022

Between:
Chilukuri Bhanusai Bramareswari ... Plaintiff
AND
Gadagoti Swapna ... Defendant
To,
గడగోటి స్వప్న, భర్త. జి.సత్యనారాయణ, ప్రొ: మెస్సర్స్ బ్యూటీ ట్రెండ్స్, డోర్ నెం.48-13-6ఎ, ప్లాట్ నెం.173, 3వ లైన్, నాగార్జున నగర్, విజయవాడ-520008, ఎన్‌టిఆర్ జిల్లా.
పై నెంబరు దావాలో ప్రతివాదికి దావా సమన్లు జారిచేయు నిమిత్తం శ్రీ కోర్టువారు ఉత్తర్వులు యిచ్చి యున్నారు. సదరు ప్రతివాది ది.11-04-2024వ తేదీన ఉదయం గం.10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ, అడ్వకేటు గారి ద్వారాగానీ హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ///
వాయిదా తేది: 11-04-2024
పొట్లూరి మోహన రామప్రసాదు న్యాయవాది
డి.నెం.54-16-1/8ఎ, వెటర్నరీ కాలనీ,
విజయవాడ-520008. సెల్:9848410237.

టెన్త్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న 10వ తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశామని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ డిల్లీరావు....డీఎస్‌ఈవో యూవీ సుబ్బారావు, ఏడీ కేఎన్‌వీ కుమార్‌తో కలిసి పదో తరగతి పరీక్షల నిర్వహణపై మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 33,007 మంది టెన్త్ పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు.

పేరు మార్పు

కృష్ణాజిల్లా గుడివాడ మండలం రామచంద్రపురం గ్రామం డోర్ నెంబర్ 17/59 కాపురస్తులు వల్లూరి రామకృష్ణారావు గారి భార్య అయినా నాకు వివాహానికి ముందు రొంపిచర్ల లక్ష్మీ ప్రసన్న అని పేరు ఉండేది నాకు వల్లూరి రామకృష్ణారావు గారితో వివాహ అనంతరం వల్లూరి లక్ష్మీప్రసన్నగా పేరు మారినది. ఆధార్ కార్డు నందు నా పేరు వల్లూరి లక్ష్మీప్రసన్న గానే నమోదయి ఉన్నది పోస్ట్ ఆఫీస్ నందు పోస్టల్ ఇన్సూరెన్స్ పాలసీ నెంబర్ ఆర్ - ఏపీ - ఇఏ -3 7 6 1 7 6 5, ఆర్- ఎపి -ఇఎ - 3 7 6 1 7 6 2 కలిగి ఉన్నాను. సదరు పోస్టల్ ఇన్సూరెన్స్ పాలసీ లలో రొంపిచర్ల లక్ష్మీ ప్రసన్న గానే నా పేరు ఉన్నది. రొంపిచర్ల లక్ష్మీ ప్రసన్న అలియాస్ వల్లూరి లక్ష్మీప్రసన్న అని పరిగణలో తీసుకుని పాలసీ మొత్తమును వల్లూరి లక్ష్మీప్రసన్న పేరుకు గల ఎకౌంటుకు జమ చేయవలసిందిగా ధ్రువీకరిస్తున్నాను.

ప్రకటన
మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ కృష్ణాజిల్లా మచిలీపట్నం 9వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో
A.S.No.42/2019

Between:
సమ్మెట బసవరావు & మరియొకరు ...అప్పిలెంట్స్
మరియు
సమ్మెట శంకరరావు & అదర్స్ ...రెస్పాండెంట్స్
టు,
R-3: రాజశ్రీ, D/o.(లేటు) సుబ్బరావు, డోర్ నెం. 7-26-137, శారదనగర్, సఫిల్‌గూడ, సికింద్రాబాద్.
R-13: వడ్డే దుర్గాప్రసాద్, తండ్రి: వడ్డే రామారావు, కాలువబండ దగ్గర, పామర్రు.
పై నెంబరు అప్పీలులో 3, 13వ రెస్పాండెంట్స్ అయిన మీకు నోటీసు నిమిత్తం ది.24-4-2024నకు వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట మీరు స్వయంగా గానీ లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథములు జరిపించబడును. అని యిందుమూలంగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:24-04-2024
వి.వి.వరదరాజులు,
మచిలీపట్నం అప్పిలెంట్స్ తరపున న్యాయవాది
ది.13-03-2024 మచిలీపట్నం

ప్రకటన

రాఘువ ఎస్టేట్స్ వారి వెంకటాపురం కాలనీ (LP No 4/1999) పోరంకి ప్లాట్ ఓనర్స్ వారు వెంకటాపురం కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (11/2019) గ రిజిస్టర్ అయినారు. ఇందు మూలముగ యవన్మందికి, ప్రక్కన రైతులకు, రాఘువ ఎస్టేట్స్ వారికి, ఇప్పటికి వెంకటాపురం కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (11/2019) పోరంకి నందు సభ్యత్వం తీసుకున్న, తీసుకోని ప్లాట్ యజమానులకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ వెంకటాపురం కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (11/2019) వారు పూర్తి కాలనీ సర్వే చేసారు. వారు కాలనీ సరిహద్దుల ,కాలనీ రోడ్స్ సరిహద్దుల రాళ్లు వేసుకోబోతున్నారు, సర్వే యొక్క వివరాలు అసోసియేషన్ వద్ద పొందగలరు,కావున ఎవరికన్నా ఎమన్నా సందేహాలు, అభ్యంతరాలు వున్నచో ఈ రోజు నుండి 15 రోజులలోగా కె.మురళి కిషోర్ గారు (అడ్వకేట్) (ఫోన్ 7013925273), GF-2, కృష్ణ సాయి అపార్ట్మెంట్స్, న్యూ పోస్టల్ కాలనీ , పటమట, విజయవాడ - 520010, లేదా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జూపల్లి శ్రీనివాస్ (7989441938) గారికి కానీ తెలుపగలరు లేనిచో రిజిస్టర్ పోస్ట్ ద్వారా క్రింది అడ్రెస్స్ కు మీ యొక్క అభ్యంతరాలు తెలుపుగలరు. ప్లాట్ యొక్క పరిమాణం, కొలతల తేడాల సమస్యలకు అసోసియేషన్ వారికి ఎటువంటి సంబంధం ఉండదు, రాఘువ ఎస్టేట్స్ వారిని సంప్రదించవలెను. ఈ 15 రోజులలో ఎవరినుంచి ఎటువంటి అభ్యంతరాలు లేనిచో ఆ తరువాత అసోసియేషన్ వారు కాలనీ సరిహద్దుల, కాలనీ రోడ్స్ సరిహద్దుల రాళ్లు వేసుకుంటారు.

వెంకటాపురం కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (11/2019)
వెంకటాపురం కాలనీ,
NTR గార్డెన్స్ ప్రక్కన,
సాలిపేట రోడ్ ,
పోరంకి, విజయవాడ- 521137
ఫోన్ : 7989441938

ఇట్లు
కె.మురళి కిషోర్ (అడ్వకేట్),
(ఫోన్ 7013925273),
GF-2, కృష్ణ సాయి అపార్ట్మెంట్స్,
న్యూ పోస్టల్ కాలనీ ,
పటమట, విజయవాడ - 520010,

గ్రామ పంచాయతీ కార్యాలయం - ఉప్పులూరు

టెండర్ ప్రకటన తేది: 15-03-2024

కృష్ణా జిల్లా, కంకిపాడు మండలం, ఉప్పులూరు గ్రామపంచాయతీ నందు ఈ క్రింది వివరించిన పనులు చేయుటకుగాను ఆసక్తిగల వారి నుండి ది. 20-03-2024 తేదిన మధ్యాహ్నం 02.00 గంటల నుండి 02.30 ని॥ల వరకు ఈ దిగువ సంతకము చేసిన వారి నుండి సీల్డ్ టెండర్లు స్వీకరించబడును. సదరు టెండర్లు అదే రోజు మధ్యాహ్నము 04.00 ని॥లకు అప్పటికి హాజరైన టెండరుదారులు సమక్షంలో టెండర్లు తెరువబడును. మిగిలిన విషయములు కార్యాలయం పని వేళల యందు తెలుసుకొనవలెను.

వ.నెం.	పని వివరము	పని కాలం	ధరావత్తు
1.	ట్యాంకు ఆపరేటర్ (2)	01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ. 500/-
2.	పారిశుద్ధ్యం పనివారు (20)	01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ. 500/-
3.	ఎలక్ట్రిషియన్ (1)	01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ. 500/-
4.	పంపు మెకానిక్ (ఫిట్టర్) 1	01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ. 500/-

గమనిక: 1. గతంలో పని చేసిన వారికి ముందుగా ప్రాధాన్యత ఇవ్వబడును.
2. గ్రామపంచాయితీ నిధుల నిల్వను బట్టి జీతాలు ఇవ్వబడును.
3. టెండర్ స్వీకరించుటకు, నిరాకరించుటకు, ఏకారణము లేకుండా రద్దు చేయు అధికారము గ్రామపంచాయితీకి కలదు.

సం॥ శ్రీమతి లాం సోనియా
సర్పంచ్,
గ్రామపంచాయతీ, ఉప్పులూరు

సం॥ టి.శ్రీనివాస్,
పంచాయతీ కార్యదర్శి
గ్రామపంచాయతీ, ఉప్పులూరు

గ్రామ పంచాయతీ కార్యాలయం - వేల్పూరు

టెండర్ ప్రకటన తేది: 16-03-2024

కృష్ణా జిల్లా, కంకిపాడు మండలం, వేల్పూరు గ్రామపంచాయతీ నందు ఈ క్రింది వివరించిన పనులు చేయుటకుగాను ఆసక్తిగల వారి నుండి ది. 21-03-2024 తేదిన ఉదయం 10.30 గంటల నుండి 11.30 ని॥ల వరకు ఈ దిగువ సంతకము చేసిన వారి నుండి సీల్డ్ టెండర్లు స్వీకరించబడును. సదరు టెండర్లు అదే రోజు మధ్యాహ్నము 01.30 ని॥లకు అప్పటికి హాజరైన టెండరుదారులు సమక్షంలో టెండర్లు తెరువబడును. మిగిలిన విషయములు కార్యాలయం పని వేళల యందు తెలుసుకొనవలెను.

వ.నెం.	పని వివరము	పని కాలం	ధరావత్తు
1.	పారిశుద్ధ్యం పనివారు (4)	01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ. 500/-
2.	ట్యాంక్ ఆపరేటర్ (1)	01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ. 500/-
3.	ఎలక్ట్రిషియన్ (1)	01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ. 500/-

గమనిక: 1. గతంలో పని చేసిన వారికి ముందుగా ప్రాధాన్యత ఇవ్వబడును.
2. గ్రామపంచాయితీ నిధుల నిల్వను బట్టి జీతాలు ఇవ్వబడును.
3. టెండర్ స్వీకరించుటకు, నిరాకరించుటకు, ఏకారణము లేకుండా రద్దు చేయు అధికారము గ్రామపంచాయితీకి కలదు.

సం॥ బి.వెంకటేశ్వరరావు,
పంచాయతీ కార్యదర్శి,
గ్రామపంచాయతీ, వేల్పూరు

సం॥ శ్రీమతి చెన్నుబోయిన శివనాగేంద్రమ్మ
సర్పంచ్
గ్రామపంచాయతీ, వేల్పూరు

గ్రామ పంచాయతి కార్యాలయము, మేడూరు
టెండరు ప్రకటన

ఆర్.ఒ.సి.నెం.నిల్/2024 తేది:13-03-2024

కృష్ణాజిల్లా, పమిడిముక్కల మండలం, మేడూరు గ్రామపంచాయతి పరిధిలో పనిచేయుచున్న కాంట్రాక్టు సిబ్బంది గడువు ది.31-03-2024వ తేదీతో ముగియుచున్నందున 2024-2025 సం॥మునకు దిగువ తెల్పిన పనులు చేయుటకు దిగువ తెల్పిన విధంగా ది. 22-03-2024న ఉదయం గం. 11.00 వరకు టెండర్లు స్వీకరించబడి అదేరోజు మధ్యాహ్నం గం॥12-00 లకు హాజరైన టెండరు దారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. మిగిలిన వివరములు కార్యాలయము పని చేయు వేళలయందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరము	కాలము	ధరావత్తు రూ.
1.	మంచినీటి సరఫరా నిర్వహణ, వీధిలైట్ల నిర్వహణ, ప్రజారోగ్యము-పారిశుధ్య పనుల నిర్వహణ పనులు చేయుటకు 8 మంది వ్యక్తులను సప్లైచేయుటది.	1-4-2024 నుండి 31-3-2025 వరకు	రు 5000/- లేదా హామి పత్రము

గమనిక: అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. గ్రామ పంచాయితీ ఆమోదమునకు లోబడి మాత్రమే టెండర్లు ఆమోదించబడును మరియు నిధుల సౌలభ్యమును బట్టి చెల్లింపులు చేయబడును.

(సం) కె.బి.ఆర్.సుధాకర్,
పంచాయతి కార్యదర్శి
గ్రామ పంచాయతి, మేడూరు.

గ్రామ పంచాయితీ కార్యాలయము - మోటూరు
టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం. 22/2024 తేది: 10.03.2024

కృష్ణాజిల్లా, గుడివాడ మండలం, మోటూరు గ్రామ పంచాయతీకి 2024-2025 సంవత్సరమునకు ఈ దిగువ ఉదహరించిన షెడ్యూల్ దాఖలు కాంట్రాక్టు లేబరు పనులు చేయుటకు ది: 21-03-2024 గురువారం మధ్యాహ్నం 12-00 గంటలకు వరకు మోటూరు గ్రామ పంచాయతీ కార్యాలయము వద్ద పంచాయతీ కార్యదర్శి గారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు నిర్వహించబడును. తదుపరి అప్పటి టెండరు దారుల సమక్షములో మధ్యాహ్నం 1-00 గ॥లకు సీల్డు టెండరుదార్ల తెరువబడును. మిగిలిన వివరములను ఆఫీసు పనిచేయు వేళలందు తెలుసుకొనవచ్చును.

వ.నెం	పని వివరము	ధరావత్తు
1.	మంచినీటి సరఫరా నిర్వహణ - 2 వ్యక్తులు	రూ. 5000/-లు
2.	స్వీపర్(పారిశుధ్య) పనులు నిర్వహణకు- 4 వ్యక్తులు	రూ. 5000/-లు
3.	వీధి దీపముల నిర్వహణ పనుల నిమిత్తం- 1 వ్యక్తి	రూ. 5000/-లు

నోట్:- 1.ధరావత్ గానిహామి పత్రము గాని జతపరచవలెను
2.నిధుల నిల్వను బట్టి పేమెంట్ చేయబడును.
3.గతంలో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. మరియు పంచాయతి నిల్వలను బట్టి పేమెంటు జరుపబడును.

సం// కురగంటి పద్మ
సర్పంచ్
గ్రామ పంచాయతీ, మోటూరు

సం// పి. జనార్ధనరావు,యం.ఎ
పంచాయతీ కార్యదర్శి
గ్రామ పంచాయతీ, మోటూరు

హుండీ ఆదాయం రూ. 1,11,855

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం ఘంటసాల గ్రామంలో ఉన్న శ్రీ జలదీశ్వర స్వామి వారి దేవస్థానంలో హుండీలు 5 నెలలకుగానూ శుక్రవారం లెక్కించగా రూ.1,11,855 ఆదాయం వచ్చిందనిఈఓ యార్లగడ్డ వాసు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమం కొల్లేటికోట దేవస్థానం ఈవో కెవి.గోపాలరావు పర్యవేక్షణలో జరిగింది. అర్చకులు, భక్తులు, గ్రామస్తులు సమక్షంలో హుండీల లెక్కింపు జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు వేమూరి ప్రవీణ్, వేమూరి రత్నశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ రెండో వార్డ్ కు చెందిన తుంగల రాజహంస పెయింటర్ గా పనిచేస్తూ జీవనోపాధి సాగిస్తున్నాడు. ఇటీవల పనిచేస్తూ గాయపడి మంచానికే పరిమితంకావడంతో విషయాన్ని తెలుసుకున్న శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు శుక్రవారం బాధితుడి వద్దకు వెళ్లి పరామర్శించి రాజహంసకు రూ 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తోట శ్యామ్ కష్ణ, సాయి ధీరజ్, పాస్టర్ విలియం కేరి, బొంతు ప్రకాష్, మెరుగు రణధీర్, ఆకుల మణికంఠ పాల్గొన్నారు

వీల్‌చైర్ వితరణ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం 10 వ డివిజన్‌లో నివసించే శోభ అనే వృద్ధురాలు తీవ్రమైన నరాల బలహీనత వలన లేచి నడవగలిగే పరిస్థితి లేకపోవడంతో డివిజన్ కార్పొరేటర్ షేక్ ముంతాజ్ బేగం, వీల్ చైర్ కోసం మైత్రీ ఫౌండేషన్ ని సంప్రదించారు. వెంటనే స్పందించిన మైత్రీ ఫౌండేషన్ శుక్రవారం సాయంత్రం బాధిత వద్ధురాలికి వీల్ చైర్ అందజేసింది. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు షేక్ బాషా, మైత్రీ ఫౌండేషన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధురాలి కుటుంబసభ్యులు మైత్రీ ఫౌండేషన్ కు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం మల్లంపల్లి గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నూతన సిసి రహదారి నిర్మాణానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. గ్రామపంచాయతీ సర్పంచ్ బెల్లంకొండ అమలేశ్వర రావు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6 లక్షలతో 110 మీటర్ల సిసి రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు కొలుసు ఝాన్సీలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి యార్లగడ్డ శివరామ ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ అబ్దుల్ నయీమ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - గుడివాడ : భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాసం పరీక్షలు రాసినటువంటి విద్యార్థులకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ సమరం మాట్లాడుతూ ఉద్యమాల వేగుచుక్క అయినటువంటి ఎస్ఎఫ్ఐ యుటిఎఫ్ ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం అనే పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. గుడివాడ మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు సుమారు 1000 మంది ఈ పరీక్షలు రాశారని, వీరికి బహుమతులు అందించినట్లు తెలిపారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని, వారి లక్ష్యం కోసం శ్రమించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గుడివాడ పట్టణ కార్యదర్శి సమీర్, ఉషోదయ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ తుమ్మల రత్న పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేసిన దృశ్యం

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఈనెల 18వ తేదీ నుంచి జరగనున్న పదవ తరగతి ప్రశ్న పత్రాల్లో క్యూఆర్ కోడ్ నిక్షిప్తమై ఉంటుందని, విద్యార్థులు ఎవరైనా లీక్ చేస్తే వెంటనే తెలిసిపోతుందని, దీనిని ట్యాంపర్ చేయడానికి ఎవరు సాహసించవద్దని, లీక్ చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటానమి జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు.పదవ తరగతి పరీక్షల నిర్వహణపై కలెక్టర్ శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో (కలెక్టర్ బంగ్లా)లో విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఇఓ తాహెరా సుల్తానా పదవ తరగతి పరీక్షల సన్నద్ధత గురించి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి నెల 18వ తేదీ నుండి 30వ తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది మొత్తం 26,507 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాస్తున్నారన్నారు. అందులో 14,455 మంది బాలురు కాగా 12,052 మంది బాలికలు ఉన్నారన్నారు. పరీక్షల నిర్వహణకు 151 పరీక్ష కేంద్రాలను, 151 చీఫ్ సూపరింటెండెంట్ లను, డిపార్ట్మెంట్ అధికారులను నియమించామన్నారు. పరీక్షా కేంద్రాలను మొబైల్ ఫ్రీ జోన్ ప్రకటించినట్లు, కావున పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులు గాని, పరీక్ష నిర్వహణ విధులు నిర్వహించేవారు గానీ (చీఫ్ సూపర్నెంట్లు మినహా) ఎటువంటి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు గాని అనుమతి లేదని స్పష్టం చేశారు. జిల్లా విద్యాధికారి తహెరా సుల్తానా పరీక్షల సహాయ కమిషనర్ దేవివ్రాజు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణి

ప్రజాశక్తి-పెడన : పేద ప్రజలు ఏదైనా ప్రమాదంలో, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఆర్థిక సహాయం చేయడంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ ముందుం టారని నియోజకవర్గ వైకాపా ఇన్చార్జి ఉప్పాల రాము కొనియాడారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 35 మంది బాధితులకు 32 లక్షలు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు జగన్ ప్రభుత్వంలో అనేక పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న ఉప్పాల రాము

కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడలోని 1టౌన్ పరిధిలో సిఐ ఇంద్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర బలగాల కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా డియస్పి పి.శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ గుడివాడ పట్టణంలోని పలు ప్రాంతాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించామన్నారు. గుడివాడ సబ్ డివిజన్ 287 విభాగానికి చెందిన 92 మందిని కేటాయించారన్నారు. గుడివాడ, పామర్రు నియోజక వర్గాల్లోని సమస్యాత్మక గ్రామాలు, వార్డుల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించి ప్రజలకు భరోసా కల్పిస్తారన్నారు. కవాతులో ఎస్ఐ గౌతమ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధం

ప్రజాశక్తి కలక్టరేట్(కృష్ణా) : ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధం అని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి బి. ప్రకాష్ రావు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఓటర్ల నమోదుకై గిరిజన ప్రాంతాలలో ప్రత్యేకంగా ఓటరు ఫారం 6 పై అవగాహన సదస్సు 22 వ డివిజన్ ముస్తాఖాన్ పేటలో శుక్రవారం గిరిజనులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోవార్డు కౌన్సిలర్ వెంకటేశ్వరావు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు హర్షణీయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎస్ఆర్ గ్రూప్ అధినేత తిరుపతి శ్రీనివాసరావు ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయటం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సొంటి నాగరాజు ప్రశంసించారు. శుక్రవారం అవనిగడ్డలోని కోడూరు రోడ్ లో గల పెట్రోల్ బంక్ ఎదురుగా శ్రీనివాస రావు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని నాగరాజు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం నాయకులు ఆవుల బసవయ్య మాట్లాడుతూ తిరుపతి శ్రీనివాసరావు చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయం అన్నారు. ఈనాడు తాను సంపాదించిన దానిలో కొంతమేర ప్రజల కోసం ఖర్చు చేయడం మంచి పరిణామాన్ని ప్రజల కోసం సేవలు చేసే వారిని ప్రజలు ఎప్పుడు గుర్తుంచుకుంటారని అన్నారు. అనంతరం బాటసారులకు చలివేంద్రం ప్రారంభ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు సింగోతు నాగేంద్రం, కడపకు చెందిన బీసీ నాయకులు రమణ, బురుసు శివ, జనసేన మత్స్యకార సంఘం రాష్ట్ర కార్యదర్శి లంకె యుగంధర్ రావు, జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షులు బొల్లా హరిబాబు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దోవ గోవర్ధన్, లైన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు పూత బోయిన సాయి పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొంటి నాగరాజు

హక్కులపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలి : జెసి

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : ప్రతి వినియోగదారుడు రాజ్యాంగం వారికి కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. వినియోగదారుల హక్కుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ సమావేశాల్లో వినియోగదారుల హక్కులు పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గీతాంజలి శర్మ మాట్లాడుతూ ప్రతి వినియోగదారులు ప్రతిరోజూ అనేక రకాల వస్తువులను కొనుగోలు చేస్తాడని, కొన్ని సందర్భాల్లో వ్యాపారుల చేతుల్లో మోస పోవాల్సి వస్తుందని, వ్యాపారాల్లో జరిగే మోసాలను నివారించడానికి వినియోగదారులకు అనేక హక్కులు ఉన్నాయన్నారు. వాటిని పూర్తిగా తెలుసుకుని మోసాలను అరికట్టాలని సూచించారు. వినియోగదారులందరి హక్కుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి మరియు వివక్ష, దోపిడీ మరియు ఇతర రకాల అన్యాయమైన పద్ధతుల నుండి వారిని రక్షించడానికి ప్రతి సంవత్సరం మార్చి 15న ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ శాఖ అధికారి వి. పార్వతి, జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ గోపాలకష్ణ, కన్స్యూమర్ వాయిస్ చైర్మన్ ఏ ఆర్ కే మూర్తి,డిసిఐసి ఇంచార్జ్ ఎస్ భాస్కరరావు, వినియోగదారులు పాల్గొన్నారు.

బహుజన నేత కాన్షీరామ్

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : దేశంలో వేలాది కులాలుగా చీలిపోయి వున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన ప్రజలను రాజ్యాధికారం వైపు అడుగులు వేయించిన బహుజన భాంధవుడు కాన్షీరామ్ అని బహుజన సమాజ్ పార్టీ మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి సౌడాడ బాలాజీ కొనియాడారు. కాన్షీరామ్ 90 జయంతి సందర్భంగా స్థానిక డా బిఆర్ అంబేద్కర్ సర్కిల్ లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో బహుజన సమాజానికి బాబాసాహెబ్ అంబేద్కర్ తరువాత అంతటి గొప్ప స్ఫూర్తి కాన్షీరామ్ అని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు కాండ్రు చిన్నా, పాలిపి రంగా, బొమ్మిడి విజయ్, జవ్వాది రాజా తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రహదారిని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ కైలే అనిల్‌కుమార్

సిమెంట్ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-పమిడిముక్కల : పేద ప్రజల కోసం వైయస్ జగన్మోహన్ రెడ్డి నవరత్నాలను ప్రవేశపెట్టారని పామర్రు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం పమిడిముక్కల మండలంలోని మేడూరు పంచాయతీలో రూ.45 లక్షల పైగా సిమెంట్ రోడ్లు ప్రారంభించారు. పమిడిముక్కల కోఆపరేటివ్ బ్యాంకులో ప్లాట్ ఫాంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమ్మఒడి, నాడు-నేడు, రైతు భరోసా, జగనన్న కాలనీలలతో ఇళ్లస్థలాలు ఇలా ప్రతి ఒక్క కుటుంబానికి మేలు చేశారని అన్నారు. మేడూరు గ్రామ అభివద్ధి కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడూరు గ్రామ సర్పంచ్ గరికపూడి స్వర్ణలత, బుజ్జి, మేడూరు ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు మినుగురు శ్రీనివాసరావు, వంశీకష్ణ, గ్రామ కార్యదర్శి సుధాకర్, వైయస్సార్ పార్టీ నాయకులు ఏనుగ మస్తాన్‌రావు, పాతూరు చంద్రపాల్, ఉపాధ్యక్షులు గంజాల సీతారామయ్య, పమిడిముక్కల కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు మైనేని కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

చెన్నైస్ అమిర్త విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: న్యూఢిల్లీలో జరిగిన కలినరీ ఆర్ట్స్ ఆఫ్ ఇండియా 2024 కలినరీ పోటీల్లో విజయవాడకు చెందిన చెన్నైస్ అమిర్త ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ విద్యార్థులు పతకాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ సామ్యూల్ , ఏరియా మేనేజర్ సి. హెచ్.కష్ణ కిశోర్ తెలిపారు. ఎం. జీ. రోడ్డు లోని కళాశాల కాన్ఫరెన్స్ హల్ నందు శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ విద్యార్థులు ఒక వెండి, ఒక కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు అన్నారు. ఈ ఏడాది మార్చి 7 వ తేదీ నుంచి 11వ తేదీ మధ్య జరిగిన ఐసిఎఫ్ కలినరీ ఆఫ్ ఇండియా 2024 (సిఎఐ)కాంపిటీషన్స్ తరుపున మొట్టమొదటిసారిగా మన ఆంధ్రప్రదేశ్ నుండి విజయవాడ క్యాంపస్ కు చెందిన చెన్నైస్ అమిర్త ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెూటల్ మేనేజ్మెంట్ విద్యార్థులు పాల్గొన్నారనీ తెలిపారు. వీరికి చెఫ్ కార్తీక్ , చెఫ్ గణేష్ ప్రత్యేక శిక్షణ ఇచ్చారనీ తెలిపారు. ఈ కాంపిటిషన్స్‌లో అన్ని రాష్ట్రాలనుండి హెూటల్ మేనేజ్మెంట్ చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో చెన్నైస్ అమిర్త విద్యార్థులు యర్రంశెట్టి వెంకట్ సాయి లైవ్ కార్వింగ్‌లో ఒక వెండి పతకాన్ని, లైవ్ కుకింగ్‌లో ఎం.సాయి భవానీ వెంకట్ ఒక కాంస్య పతకాన్ని గెలుచుకున్నారని తెలిపారు.

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: ఇటీవల థాట్ వర్క్స్ టెక్నాలజీస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో గుడ్లవల్లేరు ఏఏఎన్ఎమ్ అండ్ వివిఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు ఎనిమిది ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ ఆనందాన్ని వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా విద్యార్థులను, విభాగాధిపతులు ఎ.కృష్ణచైతన్య, సరోజినీలను చైర్మన్ డాక్టర్ నాగేశ్వరావు వల్లూరిపల్లి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సత్యనారాయణరావు, కోసెక్రటరీ రామకృష్ణ అభినందించారు.

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-కోడూరు: కోడూరు, నాగాయలంక మండల కేంద్రాల్లో టిఎస్ఆర్ గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను టిఎస్ఆర్ గ్రూప్ అధినేత తిరుపతి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కోడూరు మండలంలో చలివేంద్ర కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ ఏడాది అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో కూడా ఈ చలివేంద్రాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శొంఠి నాగరాజు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మండవ బాలవర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఈ నెల 17వ తేదీన చిలకలూరిపేట మండలం బొప్పిడి గ్రామంలో జరిగే మూడు పార్టీల ఉమ్మడి బహిరంగ సభను జయప్రదం చేయాలని బుద్ధ ప్రసాద్ జనసేన బిజెపి నాయకులతో కలిసి పిలుపునిచ్చారు. మూడు పార్టీల కలయిక గల కారణాలను వివరిస్తూ ప్రజా గళం పేరుతో నిర్వహిస్తున్న ఈ బహిరంగ సభకు ప్రధాని నరేంద్ర మోడీ, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొంటారని చెప్పారు. అంతకుముందు అవనిగడ్డలోని పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఉమ్మడి సమావేశంలో బుద్ధప్రసాద్ విలేకరులతో మాట్లాడారు. జగన్ పాలనలో అభివృద్ధి అనే పదానికి నిర్వచనం లేకుండా పోయిందన్నారు. యువతకు భవిత లేకుండా పోయిందని రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో పయనింపచేయాలన్న యువతకు ఉపాధి విద్యా అవకాశాలను కల్పించాలంటే మూడు పార్టీల ఉమ్మడి కూటమికి ప్రజలందరూ మద్దతు నిలవాలని కోరారు. ఐదు సంవత్సరాలుగా అవనిగడ్డ నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు.

ఇళ్లపట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-మోపిదేవి: మోపిదేవి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ పంచాయతీలో గల అన్నవరం గ్రామంలో నివేశన స్థలాల ఇళ్లపట్టాలను సర్పంచ్ సోములమ్మ చేతుల మీదగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అన్నవరం గ్రామంలో గల జగనన్న లే ఔట్ లో 27 మందికి ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు సోములమ్మ అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరరావు, వీఆర్వో వరప్రసాద్, గ్రామ సచివాలయ కార్యదర్శి గొరిపర్తి సుధాకర్ పాల్గొన్నారు.

మహిళల్లో ఆత్మస్థైర్యం శుభ పరిణామం

ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీమోహన్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: గత మూడు దశాబ్దాలుగా వివిధ రంగాలలో సమాజంలో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని మహిళలు ఆత్మస్థైర్యంతో జీవించడం శుభపరిణామమని రాష్ట్ర పురావస్తు, మ్యూజియం శాఖ ముఖ్య కార్యదర్శి జి.వాణీమోహన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ మహిళా విభాగం రాష్ట్ర శాఖ, ఎన్టీఆర్ జిల్లా మహిళా విభాగం సంయుక్తంగా నిర్వహించిన సాంస్కృతిక, క్రీడాంశాలలో 13, 14 తేదీలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు శుక్రవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకప్పుడు ఉన్న లింగ బేధాలు ప్రస్తుతం అంతరించిపోయాయన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలోనూ సమఉజ్జీలుగా నిలుస్తున్నారన్నారు. మరీ ముఖ్యంగా ఈ తరం మహిళలు గతంలో వలె వంటింటికి పరిమితం కాకుండా విద్యా, ఉద్యోగ రంగాలలో తమదైన ప్రతిభతో ఉన్నత స్థానం పొందేందుకు చేస్తున్న కషి ప్రశంసనీయమన్నారు. తమ జీవిత భాగస్వామి ఎంపికలో కూడా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రస్తుతం మహిళల జీవనశైలి చూస్తుంటే మహిళా సాధికారతకు ప్రతిబింబంగా కనిపిస్తున్నారన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ మహిళా విభాగం చైర్పర్సన్ వి. నిర్మల కుమారి మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు తమ దైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేలా తమ జీవనశైలిలో మార్పు చేసుకోవాలన్నారు. పురుషులతో పోల్చుకుంటే మహిళలకు పని భారం ఎక్కువన్నారు. ఇలాంటి సందర్భాలలో సమయం కీలకపాత్ర పోషిస్తుందని, ఈ అంశంలో మహిళలు ప్రతి పనికి సమయపాలన విధించుకొని ఆరోగ్యకరమైన జీవితం గడిపేందుకు వారికి వారే బాధ్యతలు నెరవేర్చే అంశంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.వి. శివారెడ్డి, కార్యదర్శి చౌదరి పురుషోత్తమ నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ విభాగం సలహాదారు ఎన్. చంద్రశేఖర్ రెడ్డి, ఎన్జీవో సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, కార్యదర్శి ఎండి ఇక్బాల్, క్యాపిటల్ సిటీ ప్రెసిడెంట్ నాగభూషణం, కార్యదర్శి సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ పి.మాధవి, కో కన్వీనర్స్ ఎం. గౌరి, వివి లలితాంబ, జాయింట్ కన్వీనర్ నాగమల్లేశ్వరి, మహిళా విభాగం చైర్ పర్సన్ రాధా రాణి తదతరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులకు నిర్వహించిన మెమరీ గేమ్స్, క్యారమ్స్ (డబుల్స్), చదరంగం, అంత్యాక్షరి, వ్యాసరచన, వక్తత్వము (తెలుగు), పాటల పోటీలు, నృత్యాంశాలలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తతీయ, ప్రోత్సాహక బహుమతులను వాణీమోహన్ అందజేశారు.

బహుమతులు అందజేస్తున్న వాణీమోహన్

'గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న అక్కులప్పనాయక్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: గిరిజన సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకే గిరిజనుల మద్దతు ఉంటుందని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు కే.అక్కులప్ప నాయక్ అన్నారు. స్థానిక గాంధీ నగర్ లోని ప్రముఖ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గిరిజన నాయకులు మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేసే పార్టీలకే గిరిజనుల మద్దతు ఉంటుందని అన్నారు. వైసిపి ప్రభుత్వం గిరిజన సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని అన్నారు . దాదాపు 20 గిరిజన సంక్షేమ పథకాలను రద్దు చేసి గిరిజనులు మోసం చేసిందని ఈ ఐదు సంవత్సరాలు కాలంలో ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించి గిరిజన సంక్షేమానికి తూట్లు పొడిచారన్నారు .అంతే కాకుండా ప్రభుత్వము ఉన్నత విద్యను దూరం చేసేందుకు జీవో నెంబర్ 77 తీసుకు వచ్చిన ఈ ప్రభుత్వం మరి ఉన్నత విద్యను దూరం చేయడం కాదా అని అన్నారు. ఈ రాష్ట్రంలో అనేక సంవత్సరాలుగా సంక్షేమ హాస్టల్స్ మరియు గురుకుల పాఠశాలలో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించకుండా గిరిజన విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నటువంటి ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పటానికి గిరిజనులు కంకణం కట్టుకున్నారని అన్నారు. జరగబోవు ఎన్నికల్లో గిరిజన సంక్షేమానికి అభివద్ధికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకే మా మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి పళ్ళల రాజ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర నాయకులు డి.వెంకటేశ్వర్లు నాయక్, విజయనాయక్, బద్ధ నాయక్, ప్రవీణ్, రవి నాయక్ మంతు,తదితరులు పాల్గొన్నారు

గీతాంజలికి నివాళి

ప్రజాశక్తి-గన్నవరం: గీతాంజలి మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని గన్నవరం జెడ్పిటిసి సభ్యురాలు ఎలిజెబెత్ రాణి అన్నారు. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ కార్యాలయంలో గీతాంజలి ఫొటోకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జెడ్పిటిసి మాట్లాడుతూ మహిళకు ఇల్లు రావడం ఓర్చుకోలేని కొందరు కిరాతకులు సోషల్ మీడియాలో ట్రోల్ చేయించి ఆమె ఆత్మహత్యకి కారణమయ్యారని చెప్పారు. ఈ కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ మహిళ సంఘం జిల్లా కార్యదర్శి సురెడ్డి శ్రీమణిమ్మ పాల్గొన్నారు.

సర్వీస్ కమిషన్ అక్రమాలపై సిబిఐ విచారణ : కొల్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రతిష్టాత్మకమైన పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాజకీయ పునరావాస కేంద్రం మార్చారని మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు.శుక్రవారం స్థానిక నియోజక వర్గ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రవీంద్ర మాట్లాడుతూ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లోని అక్రమాలతో విద్యార్థుల కలలను ప్రభుత్వం నాశనం చేసిందని మండిపడ్డారు. అక్రమాలకు పాల్పడిందే కాకుండా హైకోర్టుకు తప్పుడు అఫిడవిట్ ఇచ్చిన అధికారులను ఏమనాలని ప్రశ్నించారు. ఐపీఎస్ లు గౌతమ్ సవాంగ్, సీతారామాంజనేయులుతో పాటు ధనుంజయ్ రెడ్డిపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ రావు మాట్లాడుతూ ఏపీపీఎస్సీలో చోటుచేసుకున్న అక్రమాలపై ఐదు కోట్ల మంది ప్రజలు ఆలోచించాలన్నారు. దుర్మార్గుల పాలనలో ఎంత బరితెగింపు ఉంటుందో ఇదొక ఉదాహరణ మాత్రమేనన్నారు.రాష్ట్ర యువతకు జరుగుతున్న అన్యాయం చూస్తుంటే బాధ, ఆవేదన కలుగుతున్నయన్నారు. యువత ఆశలను చంపి, జీవితాలను నాశనం చేస్తున్నరన్నారు. ఈ సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇంఛార్జి బండి రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం వి.బాబా ప్రసాద్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

ఎలక్ట్రోప్లస్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

అమృతాంజన్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో సరికొత్తగా శక్తిని ఇచ్చేందుకుగాను ఎలక్ట్రోప్లస్ షుగర్ వేరియంట్ పానీయాన్ని మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ కె.ఎం. కుమార్ తెలిపారు. ఎలక్ట్రోప్లస్ తక్కువ చక్కెర వేరియంట్ శక్తి స్థాయిలను తిరిగి నింపడానికి నిర్జలీకరణాన్ని ఎదుర్కోవడానికి రూపొందించిన పానీయం అన్నారు. వేసవి సందర్భంగా సరికొత్తగా ఆవిష్కరించినట్లు తెలిపారు. పానీయం గురించి ప్రజలకు విస్తృతస్థాయిలో తెలియచేసేందుకు ఎలక్ట్రోప్లస్ బ్రాండ్ అంబాసిడర్‌గా భారత క్రికెటర్ రుతురాజ్ గైక్వాడ్‌ను నియమించినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.